మంగళవారం
17-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 87
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

విదేశీ తిరుగుబాటుదారుడి అరెస్టు అబద్ధం

ఇంఫాల్: విదేశీ తిరుగుబాటుదారుడిని అరెస్ట్ చేసినట్లు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ అబద్ధం చెబుతున్నారని కుకీ గ్రూప్ ఆరోపించింది. అరెస్ట్ చేసిన వ్యక్తి శరణార్థి అని పేర్కొంది. సీఎం బీరెన్ సింగ్ సోమవారం ఇంఫాల్‌లో మీడియాతో మాట్లాడుతూ మయన్మార్‌కు చెందిన తిరుగుబాటు గ్రూపు కుకీ నేషనల్ ఆర్మీ (బర్మా), కేఎన్ఏ(బీ) సభ్యుడైన బర్మా జాతీయుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అయితే సీఎం ప్రకటన అబద్ధమని కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (కేఎస్‌వో-జీహెచ్‌క్యూ) ఆరోపించింది. ఆ వ్యక్తి మయన్మార్‌లో జరుగుతున్న సంఘర్షణ నుంచి పారిపోయి వచ్చిన రిజిస్టర్డ్ శరణార్థి అని పేర్కొంది. అస్సాం రైఫిల్స్‌కు ఈ విషయం తెలుసని కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి తెలిపారు.

ఢిల్లీ కొత్త సీఎం ఎంపికపై ఉత్కంఠ

- పార్టీ నాయకులతో కేజ్రీవాల్ వరుస సమావేశాలు
- నేడు రాజీనామా, ఆప్ శాసనసభాపక్షం భేటీ

న్యూఢిల్లీ: ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయంతో అక్కడి రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కేజ్రీవాల్ మంగళవారం తన సీఎం పదవికి రాజీనామా చేస్తే... తదుపరి సీఎం ఎవరనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకవైపు కేజ్రీవాల్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసేందుకు అపాయింట్‌మెంట్

- మిగతా 2 లో

మమతతో వైద్య విద్యార్థుల భేటీ

కోల్‌కతా: ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రి హత్యాచార ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నెల రోజులకుపైగా విధులు బహిష్కరించి వైద్య విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వంతో చర్చించేందుకు అంగీకరించిన వైద్యులు సోమవారం కాళీఘాట్‌లోని సీఎం నివాసానికి వెళ్లారు. కడపటి వార్తలందేసరికి ఇరు పక్షాల మధ్య చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులతో

- మిగతా 2 లో



రాజధాని రైతులకు కౌలు డబ్బులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: అమరావతి రాజధాని రైతులకు వార్షిక కౌలు డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ కౌలు డబ్బును ఆయా రాజధాని రైతుల ఖాతాల్లో ఏపీసీఆర్డీఏ ద్వారా జమ చేయనున్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు పదేళ్లుగా ప్రభుత్వం కౌలు ఇస్తున్నది. వైసీపీ ప్రభుత్వ

- మిగతా 2 లో

అమరావతి సురక్షితమే

- కృష్ణానది వరదలతో రాజధానికి ఇబ్బంది లేదు
- కొండవీటి, పాలవాగు ప్రవాహానికి 48 కిమీ కాల్వల అభివృద్ధి
- ఆరు రిజర్వాయర్లు, 26 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 3 లిఫ్టులు
- వైసీపీ దుష్ప్రచారం నమ్మొద్దు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అమరావతి రాజధాని పూర్తిగా సురక్షిత ప్రాంతంలో ఉందని, కృష్ణానది వరదలతో ఎలాంటి ఇబ్బందీ లేదని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. వైసీపీ నేతలు రాజకీయ దురుద్దేశంతో అమరావతి మునిగిపోతుందని విష ప్రచారం చేశారని, ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విజయవాడ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో మంత్రి నారాయణ సోమవారం మీడియాతో మాట్లాడారు. రాజధానికి అమరావతి పనికిరాదని గత ప్రభుత్వం ప్రచారం చేయడంతో పాటు ప్రపంచబ్యాంకుకు కూడా నిధులు ఇవ్వొద్దని లేఖలు రాసిందని నారాయణ గుర్తు చేశారు. కృష్ణానదికి రికార్డు స్థాయిలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందీ కలగలేదన్నారు. అమరావతి డిజైన్ సమయంలోనే వరద ఇబ్బందులు లేకుండా కాల్వలు, రిజర్వాయర్ల ప్రతిపాదనలు చేశామని తెలిపారు. కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహంతో పాటు గ్రావిటీ కెనాల్స్ డిజైన్ చేశామని మంత్రి చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి ఈ మూడింటిని పూర్తి చేసేలా త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. అనంతవరం నుంచి ఉండవల్లి వరకూ 23.6 కిమీలతో కొండవీటి వాగు, దొండపాడు నుంచి కృష్ణాయపాలెం వరకూ 16.7 కి.మీ మేర పాలవాగు, వైకుంఠపురం గ్రావిటీ కెనాల్‌ను 8 కి. మీ మేర అభివృద్ధి

- మిగతా 2 లో

'గిరి'జనంపై ప్రకృతి పంజా

- జలవిలయంతో నేలకూలిన గుడిసెలు
- అల్లూరి జిల్లాలో ఆరు గ్రామాలను తుడిచిపెట్టిన భారీవర్షం
- కట్టుబట్టలతో బతికిబయటపడ్డ ప్రజలు
- భరోసా ఇచ్చి సాయ మందించిన సీపీఐ నేతలు
- కన్నెత్తి చూడని అధికారగణం

విశాలాంధ్ర– జీకే వీధి: గిరిజనులపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ కురిపిస్తున్నట్టుగా గోచరిస్తోంది. వరద వచ్చి సర్వం కోల్పోయి వారం రోజులైనా... నేటి వరకు ఎటువంటి సాయం అందించకపోవడం దానికి అద్దంపడుతోంది. సమాచారం అందుకున్న సీపీఐ నేతలు మేమున్నామంటూ భరోసా ఇచ్చి వారిలో మనోధైర్యాన్ని కల్పించారు. తమకు చేతనైనంత సాయమందించి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలో వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు గిరిజనుల జీవితాలు తలకిందులయ్యాయి. కొండకోనల్లోని గెడ్డలు పొంగిపొర్లడంతో ఆరు గ్రామాల ప్రజలకు కేవలం కట్టుబట్టలే మిగిలాయి. ఒకేసారి పోటెత్తిన వరద వారి గుడిసెల్ని కూకటివేళ్లతో పెకలించి వేయడంతో నిరాశ్రయులుగానే మిగిలారు. రోడ్లు ధ్వంసం కావడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఇంత జరిగినా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. రోడ్డు పునరుద్ధరణ ప్రయత్నం తప్ప బాధితులకు ఏ సాయం అందించలేదు. భారీ వర్షాల ధాటికి దారపురంలో నివసిస్తున్న 21 కుటుంబాల ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇళ్లల్లోకి భారీగా వరద నీరు ప్రవహించి తీవ్రనష్టాన్ని మిగిల్చింది. గుమ్మిరేవుల సహా మొత్తం ఆరు గ్రామాలదీ ఇదే పరిస్థితి. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తదితరులు ఓ బృందంగా బాధితుల వద్దకు వెళ్లి పరామర్శించారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. దారపురంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు మూడు క్వింటాళ్ల బియ్యం, మంచి నూనె సహా ఇతర నిత్యావసర సరుకులు అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గుమ్మిరేవులలో సర్వం పోగొట్టుకున్న పడాల గురుమూర్తి, మంజుల దంపతులు, ధనార్జున్ తదితరులను ఓదార్చారు. ఇళ్ల నిర్మాణం కోసం రూ.ఐదు వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. గత 50 ఏళ్ల కాలంలో ఇంతటి భారీ వర్షాలను తాము చూడలేదని గిరిజనులు వాపోయారు. ఒక్కసారిగా గెడ్డలు పొంగి వరద నీరు తమ నివాసాల్లోకి చేరడంతో తీవ్రంగా నష్టపోయామని వివరించారు. రోడ్లపైనా మూడు అడుగుల నీరు ప్రవహించినట్టు తెలిపారు. రహదారులు పూర్తిగా దెబ్బ తినడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని చెప్పారు.

అనంతరం జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ భారీ వర్షాలకు గిరిజనులు సాగు చేసుకుంటున్న వందల ఎకరాల భూమి నామరూపాలు లేకుండా పోయిందని తెలిపారు. ఒక్కసారిగా విరుచుకుపడిన వరద కారణంగా పిల్లా పాపలతో గిరిజనం పడ్డ ఇబ్బందులు వర్ణించలేనివన్నారు. ఇంత జరిగినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని పేర్కొన్నారు. కనీస అవసరాలు తీర్చని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలో మరింత సాయం అందిస్తామని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి, భగవాన్, ఆళ్ల గోవిందు, గోపినాథ్ పాల్గొన్నారు.

పెట్టుబడి అవకాశాలు అపారం

- ఏపీకి రావాలని పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు ఆహ్వానం
- గుజరాత్ గ్లోబల్ ఎనర్జీ సమ్మిట్‌లో ప్రజంటేషన్
- 2030 కల్లా 72.60 జీడబ్ల్యు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి
- 'ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024' తీసుకొస్తామని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: గతంలో ఐటీ ప్రవేశపెట్టినప్పుడు వచ్చిన తరహాలో ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ విప్లవం మొదలైందని సీఎం చంద్రబాబు అన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 4వ గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, పెట్టుబడులకు ఆహ్వానంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకువచ్చే నూతన విధానాల గురించి పారిశ్రామిక వేత్తలకు వివరించారు. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. ఈ సమ్మిట్ లో సీఎం మాట్లాడుతూ 2030 నాటికి 72.60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని తెలిపారు. అదే సంవత్సరం నాటికి మన దేశం 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సాధిస్తుంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం వల్ల ఉద్యోగ, ఉపాధి కల్పన, తక్కువ ధరకే విద్యుత్ అందుబాటులోకి రావడం, పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుంది. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ అండ్ గ్రీన్ హైడ్రోజన్‌లో రాష్ట్రం విస్తారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్‌తో పాటు పన్ను మినహాయింపులు, రాయితీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సులభమైన నిబంధనలతో ఏపీ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంది. ఈ అనుకూల వాతావరణాన్ని ప్రపంచస్థాయి పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోవాలని చంద్రబాబు కోరారు. పునరుత్పాదక ఇంధనంలో ప్రపంచ అత్యుత్తమ పద్ధతులను అవలంభించడం, ఆర్ అండ్ డి, సాంకేతికతను వినియోగించుకోవడం, నాలెడ్జ్ ను షేర్ చేసుకోవడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి క్లీన్ ఎనర్జీ, సర్క్యులర్ ఎకానమీ కోసం గ్లోబల్ యూనివర్శిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 40 గిగావాట్ల సౌరశక్తి, 20 పవన శక్తి, 12 పంప్డ్ స్టోరేజ్, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, 1 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ , డెరివేటివ్స్, 2500 కేఎల్‌పీడీ బయో ఫ్యూయల్స్‌తో పునరుత్పాదక ఇంధన సామర్థ్య లక్ష్యాలను రాష్ట్రం నిర్దేశించుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల కోసం 500 పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఏపీలో ఇప్పటి వరకు 4335.28 మెగావాట్ల సోలార్, 4083.57 మెగావాట్ల పవన విద్యుత్, 443 మెగావాట్ల బయో ఎనర్జీ, 36 మెగావాట్ల వేస్ట్ టు ఎనర్జీ ఉత్పత్తి ఉంది. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లో దాదాపు 4,000 మెగావాట్ల సోలార్ పవర్ పార్కులను ఏర్పాటు చేశాం. ప్రకాశం జిల్లా, శ్రీ సత్యసాయి జిల్లాలో మరో 2,700

- మిగతా 2 లో

వైద్యవిద్యపై కుట్ర

- చెప్పిందొకటి...చేసేది మరొకటా?
- కూటమి ప్రభుత్వంపై రామకృష్ణ ధ్వజం
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై చంద్రబాబు, పవన్ సమాధానం చెప్పాలని డిమాండ్

విశాలాంధ్ర–విజయవాడ: రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. స్థానిక దాసరి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన దానికి అధికారంలోకి వచ్చిన తరువాత చేస్తున్నదానికి పొంతన ఉండటం లేదని విమర్శించారు. వైద్య కళాశాలల ఏర్పాటులో జగన్ ప్రభుత్వం జీవో 107, 108లను తీసుకువచ్చి 50శాతం సీట్లను ప్రైవేటుపరం చేసిందని... ఆనాడు రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ, వైద్య విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో కూడా తాము అధికారంలోకి వస్తే ఆ జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) వైద్యసీట్లు ఇస్తామంటే... వాటిని భర్తీ చేయలేమని...మాకు వద్దని లేఖ రాయటం దారుణం అన్నారు. భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల ఏర్పాటు, అధ్యాపకుల కొరత అంశాలను పరిష్కరించుకునే విధానం ఆలోచించకుండా సీట్లు వద్దని చెప్పటం మంచికాదన్నారు. గుజరాత్ తరహా విధానం తీసుకు వచ్చేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గుజరాత్‌లో కేవలం 6 కళాశాలలు మాత్రమే ప్రభుత్వం అధ్వర్యంలో ఉన్నాయని మిగిలినవి ప్రైవేటువ్యక్తుల చేతుల్లో ఉన్నాయని చెప్పారు. వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు బహిరంగ సవాల్ చేయటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలి తప్ప వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు రావాలనడంలో అర్థం లేదన్నారు. ఎన్నికల ప్రచారం, పాదయాత్ర, విద్యార్థి ఉద్యమాల సందర్భంగా టీడీపీ నాయకులు ఏం చెప్పారో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. కళాశాలల నిర్మాణం పూర్తి కాలేదన్న నెపంతో అసలు వైద్య సీట్లే వద్దనడం మూర్ఖత్వం అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీని వెనక్కు తీసుకున్నట్లు కనబడుతోందని రామకృష్ణ

- మిగతా 2 లో

ఇదీ లోకం!



కంగ్రాట్స్! నీ బాధలన్నింటికీ త్వరలో విముక్తి!

బోట్ల తొలగింపు సవాలే!

ప్రకాశం బ్యారేజీ వద్ద ఏడు రోజులుగా యత్నాలు

నాలుగు రకాల వ్యూహాలు విఫలం... తాజాగా ప్లాన్-5

2లో

'రిజిస్ట్రార్' రూపురేఖల మార్పు

- రాచరికపు పోకడలకు ముగింపు
- కార్యాలయాల్లో స్నేహపూర్వక వాతావరణం
- గుణదలలో పోడియం తొలగింపు పనులు ప్రారంభించిన సిసోడియా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: 'రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌కు ప్రత్యేకంగా ఎత్తయిన పోడియం, బల్ల చుట్టూ ఉండే ఎర్రని వస్త్రం తొలగిపోతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ సైతం సాధారణ అధికారి తరహాగానే ఉంటుంది. ఆయన కుర్చీ, బల్లకు ప్రత్యేక వేదిక ఉండదు' సబ్ రిజిస్ట్రార్లు సామాన్యులేనన్న భావనతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రూపు రేఖలు మార్చుతూ అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం తీసుకొస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా

- మిగతా 2 లో

పేదలపై ద్వేషం... కార్పొరేట్లకు దాసోహం

మోదీ 100 రోజుల పాలనపై నారాయణ తీవ్ర విమర్శలు

6లో

2లో

ట్రంప్‌పై హత్యాయత్నం?

అనుమానిత వ్యక్తిపై భద్రతా సిబ్బంది కాల్పులు

ట్రంప్‌పై హత్యాయత్నం?

అనుమానిత వ్యక్తిపై భద్రతా సిబ్బంది కాల్పులు

వాషింగ్టన్‌: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్‌ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్‌ ట్రంప్‌నకు సమీపంలో కాల్పులు చోటుచేసుకోవడం సంచలనం రేపింది. ఫ్లోరిడాలోని వెస్ట్‌ పామ్‌ బీచ్‌లోని తన గోల్ఫ్‌ కోర్టులో ట్రంప్‌ గోల్ఫ్‌ ఆడుతుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తుపాకీతో సంచరించాడు. దీంతో ఆ వ్యక్తిపై సీక్రెట్‌ సర్వీస్‌ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో ట్రంప్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సీక్రెట్‌ సర్వీస్‌ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎఫ్‌బీఐ పేర్కొంది. ట్రంప్‌ అప్పుడప్పుడు ఉదయం నుంచి మధ్యాహ్న భోజనానికి ముందు వరకు వెస్ట్‌ పామ్‌ బీచ్‌లోని తన గోల్ఫ్‌ కోర్టులో గోల్ఫ్‌ ఆడుతూ గడుపుతారు. ఎన్నికల ప్రచారం మగించుకొని ఫ్లోరిడా చేరుకున్న ట్రంప్‌, ఆదివారం గోల్ఫ్‌ ఆడుతున్న సమయంలో గోల్ఫ్‌ క్లబ్‌ వద్ద ఓ వ్యక్తి ఆయుధంతో సంచరించాడు. ఆ సమయంలో గోల్ఫ్‌ కోర్టును పాక్షికంగా మూసివేసి ఉంచారు. అనుమానితుడు కోర్టు కంచెలోకి ఆయుధాన్ని ఉంచడాన్ని గమనించిన ఏజెంట్లు కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీంతో సదరు వ్యక్తి ఓ ఎస్‌యూవీలో పారిపోయాడని, పోలీసులు వెంబడించి అతడిని పట్టుకున్నట్లు చెప్పారు. ఘటన ప్రాంతంలో ఏకే 47 మోడల్‌ వంటి తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. అయితే ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ కాల్పుల జరిగాయా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీక్రెట్‌ సర్వీస్‌ అధికారులు పేర్కొన్నారు.

అమెరికాలో హింసకు తావులేదు: బైడెన్‌

ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ స్పందించారు. 'ట్రంప్‌ సురక్షితంగా ఉన్నట్లు తెలిసింది. ఆయనపై హత్యాయత్నానికి పాల్పడేందుకు సిద్ధమైన అనుమానితుడు భద్రతా సిబ్బంది అదుపులో ఉన్నాడు. దీనిపై పూర్తిస్థాయి

విచారణ చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. మన దేశంలో రాజకీయ హింసకు చోటు లేదని పునరుద్ఘాటిస్తున్నా. ట్రంప్‌నకు అన్ని విధాలా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని భద్రతా సిబ్బందిని ఆదేశించా' అని పేర్కొన్నారు. ట్రంప్‌ క్షేమంగానే ఉన్నట్లు తమకు సమాచారం అందిందని ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్‌ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌ ఎక్స్‌ వేదికగా స్పందించారు.

నేను క్షేమంగానే ఉన్నా: ట్రంప్‌

డొనాల్డ్‌ ట్రంప్‌ తన అభిమానులను ఉద్దేశించి ఈ-మెయిల్‌ చేశారు. 'నాకు సమీపంలోనే కాల్పులు జరిగాయి. పరిస్థితి అదుపులో లేదనేది రూమర్లే. మీ అందరికీ ఓ విషయం గట్టిగా చెప్పదల్చుకున్నా. నేను బాగున్నా. సురక్షితంగా ఉన్నా. ఏదీ నన్ను అడ్డుకోలేదు. నన్నెవరూ ఆపలేరు. ఎప్పటికీ లొంగేదే లేదు' అని ట్రంప్‌ వెల్లడించారు.

ట్రంప్‌పై హత్యాయత్నం: ఎఫ్‌బీఐ

ట్రంప్‌పై కాల్పులకు నిందితుడు యత్నించాడని ఎఫ్‌బీఐ సైతం తెలిపింది. అమెరికావ్యాప్తంగా ట్రంప్‌ ఎన్నికల ప్రచారం చేస్తున్నప్పుడు ఆయన భద్రత గురించి సీక్రెట్‌ సర్వీస్‌ అప్రమత్తంగా ఉంటోంది. అయితే ట్రంప్‌ తన సొంత క్లబ్‌లు, గోల్ఫ్‌ కోర్టులు వంటి సొంత ప్రదేశాల్లో ఉన్నప్పుడు భద్రత తక్కువగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

బంగారు గని వివాదం... 30 మంది కాల్చివేత

పోర్టుమోర్స్‌బై: బంగారు గనిపై వివాదం 30 నిండుప్రాణాలను బలిగొన్నది. ఈ ఘటన పపువా న్యూ గినియాలో చోటు చేసుకొంది. ఈ విషయాన్ని స్థానిక పోలీసులు సోమవారం వెల్లడించారు. మృతుల సంఖ్య 50 వరకు చేరవచ్చని మీడియా కథనాలు చెబుతున్నాయి. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు. దేశ మధ్య ప్రాంతంలోని పోర్‌గెరా బంగారుగని భూమిని ఆగస్టు నుంచి సకార్‌ తెగవారు అక్రమించుకొన్నారు. వాస్తవంగా ఈ భూమిపై హక్కులు పయాండె తెగవారికున్నాయి. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య సాయుధ ఘర్షణ జరిగింది. ఆదివారం దాదాపు 300 రౌండ్లకు పైగా కాల్పులు జరిగాయి. రెండు వర్గాల మధ్య జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. మరోవైపు కెనడా జాతీయుడి యాజమాన్యంలో ఉన్న బంగారు గని అల్లర్ల కారణంగా మూతపడింది. స్థానిక భవనాలకు ముష్కరులు నిప్పుపెట్టారు. ఆస్పత్రులు, ప్రభుత్వ ఆఫీసులు మూసివేశారు. దీనికి తోడు ఆక్రమణలు, అక్రమ తవ్వకాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. భూయజమానులు, స్థానికులను భయభ్రాంతులకు గురి చేసేందుకు హింసాత్మక కార్యకలాపాలు జరుగుతున్నాయని పపువా న్యూగినియా పోలీస్‌ కమిషనర్‌ డేవిడ్‌ మన్నింగ్‌ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలను భయపెట్టేందుకు ఆయుధాలు ప్రదర్శించేవారిని కాల్చిపారేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ఘర్షణలను ఆపడానికి భద్రతా దళాలకు అదనపు అధికారాలను ప్రభుత్వం కట్టబెట్టింది. ఆల్కహాల్‌ విక్రయాలు నిలిపివేయడం, రాత్రివేళల్లో కర్ఫ్యూ విధించడం వంటి చర్యలు తీసుకొంది. గతంలో కూడా ఈ ప్రాంతంలో అల్లర్లు జరిగేవి. కానీ, ఈసారి ఆటోమేటిక్‌ ఆయుధాలు వాడటం పరిస్థితిని దిగజార్చింది. ఈ బంగారు గని నుంచే ఒకప్పుడు దేశ ఎగుమతి ఆదాయంలో 10 శాతం లభించేది. వరుసగా చోటుచేసుకొంటున్న హింసాత్మక ఘటనలు, ప్రభుత్వం ఈ గనిని స్వాధీనం చేసుకోవడంలో జాప్యం జరగడంతో ఇక్కడ ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ ఏడాది ప్రారంభంలో ఈస్ట్‌ సెపిక్‌ ప్రావిన్స్‌లో జరిగిన హింసలో 26 మంది చనిపోయారు.. వారిలో 16 మంది చిన్నారులే. 2022లో ఈ గని వద్ద జరిగిన పోరాటంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ గని ప్రాంతంలోనే మే నెలలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో 2 వేల మంది సజీవ సమాధి అయ్యారు.

అమరావతి సురక్షితమే

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామన్నారు. మొత్తం 48.3 కి.మీ మేర ఈ మూడు కాలువలు అభివృద్ధి చేస్తామన్నారు. వాగులు కొన్ని చోట్ల ఉండాల్సిన దానికంటే కుంచించుకుపోయాయన్నారు. వందేళ్లలో కృష్ణా నదికి వచ్చిన వరద ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకుని మూడు కాల్వలు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. వీటితో పాటు ఆరు రిజర్వాయర్ల నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. సీడ్‌ కేపిటల్‌ లోపల నీరుకొండ వద్ద 0.4 టీఎంసీలు, కృష్ణాయపాలెం వద్ద 0.1 టీఎంసీలు, శాఖమూరు వద్ద 0.01 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు, సీడ్‌ కేపిటల్‌ వెలుపల లాం వద్ద 0.3 టీఎంసీలు,పెదపరిమి వద్ద 0.2 టీఎంసీలు, వైకుంఠపురం వద్ద 0.3 టీఎంసీల సామర్థ్యంతో మొత్తం 6 రిజర్వాయర్లు నిర్మిస్తామని వివరించారు. ఎంత వర్షం వచ్చినా కాలువలు, రిజర్వాయర్లు సరిపోతాయన్నారు. ఒకవేళ ఇవి నిండిపోయినా కృష్ణానదిలోకి పంపింగ్‌ చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నట్లు మంత్రి చెప్పారు. 12,350 క్యూసెక్కుల సామర్థ్యం తో ఉండవల్లి వద్ద, 4000 క్యూసెక్కులతో బకింగ్‌హాం కెనాల్‌ లోకి, 5650 క్యూసెక్కులతో వైకుంఠపురం వద్ద లిఫ్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇవన్నీ పూర్తయితే ఎంతవర్షం పడినా ఒక్క చుక్క కూడా నీరు నిల్వ ఉండదన్నారు. భవిష్యత్తులో కృష్ణానదికి మరింత భారీ వరద వచ్చినప్పటికీ రాజధాని అమరావతికి ఎలాంటి ఢోకా ఉండదని స్పష్టం చేశారు. మరోవైపు కృష్ణానదికి 15 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా తట్టుకునేలా కరకట్టను బలోపేతం చేసేలా రీ డిజైన్‌ చేస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మించే సుమారు 365 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు డిసెంబర్‌లో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.

రాజధాని భవనాలకు ఇబ్బంది లేదు

రాజధానిలో 2014-2019 మధ్య నిర్మించిన భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో ఆయా భవనాల సామర్థ్యం ఎలా ఉందనే దానిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. భవనాల పరిస్థితిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఐఐటీ హైదరాబాద్‌, ఐఐటీ చెన్నైలను ప్రభుత్వం కోరింది. ఈ నివేదిక ప్రభుత్వానికి అందింది. ఐకానిక్‌ భవనాలైన సెక్రటేరియట్‌ టవర్లు, హైకోర్టుతో పాటు అధికారులు, ఉద్యోగుల కోసం నిర్మాణం చేసిన 3600 ఫ్లాట్లకు ఎలాంటి ఇబ్బందీ లేదని, వాటి నిర్మాణం కొనసాగించుకోవచ్చని నివేదికలు అందాయని, వాటిని పూర్తి చేసేందుకు రాబోయే రెండు నెలల్లో టెండర్లు పిలుస్తామన్నారు. ఐకానిక్‌ భవనాల రాఫ్ట్‌ ఫౌండేషన్‌ కూడా బలంగా ఉందన్నారు. విజయవాడ మున్సిపల్‌ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన వివిధ రకాల పన్నులకు గడువు ఈ నెల 30తో ముగిస్తున్నప్పటికీ వరదల కారణంగా ఆయా ప్రాంతాల వారికి వెసులుబాటు కల్పించేలా గడువు పొడిగిస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

మమతతో వైద్య విద్యార్థుల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

చర్చలు జరిపేందుకు ప్రభుత్వం అనేకమార్లు ప్రయత్నించింది. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితమే వారితో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. అయితే వైద్య విద్యార్థులు చేస్తున్న డిమాండ్లలో కొన్నింటికి అనుమతించలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో నేరుగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రంగంలోకి దిగి... వైద్య విద్యార్థులను ఒప్పించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కాగా ఐదోసారి ప్రభుత్వం చర్చలకు పిలవడంతో పంతం వీడిన వైద్యవిద్యార్థులు సీఎం నివాసానికి చేరుకున్నారు. అయితే సమావేశాన్ని ప్రత్యక్షప్రసారం చేయాలన్న విద్యార్థుల డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. దానికి బదులుగా సమావేశంలోని కీలక అంశాలను ఇరు వర్గాలు రికార్డు చేసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొన్నట్లు సమాచారం.

తెలంగాణ తల్లి స్థానంలో

రాజీవ్‌గాంధీ విగ్రహమా?

ఇది సిగ్గుమాలిన చర్య: కేటీఆర్‌



విశాలాంధ్ర-హైదరాబాద్‌: రాష్ట్ర సచివాలయం- తెలంగాణ అమరజ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో... కాంగ్రెస్‌ ప్రభుత్వం రాజీవ్‌ గాంధీ విగ్రహాన్ని పెట్టడం సిగ్గుమాలిన చర్య అని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టడమేనని మండిపడ్డారు. సీఎం రేవంత్‌ రెడ్డి చర్యకు నిరసనగా మంగళవారం రాష్ట్రంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలన్నింటికి పాలభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్‌ పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్‌ చేపట్టిన చర్యను వ్యతిరేకిస్తూ తెలంగాణ వాదులంతా నిరసన తెలపాలని కోరారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్‌ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటంపై తెలంగాణ సమాజమంతా ఆవేదన వ్యక్తం చేస్తుందని కేటీఆర్‌ తెలిపారు. తాము అధికారంలోకి రాగానే రాజీవ్‌ గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో గాంధీభవన్‌కు తరలిస్తామన్నారు. రాజీవ్‌ గాంధీ విగ్రహాన్ని పెట్టుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని... కానీ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్‌ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. తెలంగాణ సచివాలయం-అమర జ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని కేసీఆర్‌ 2023 జులైలోనే ఈ స్థలాన్ని ఎంపిక చేశారని కేటీఆర్‌ గుర్తు చేశారు. యావత్తు తెలంగాణ సమాజం ఆమోదముద్ర వేసిందన్నారు. కానీ కాంగ్రెస్‌ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసిందన్నారు. కాంగ్రెస్‌ చర్య ప్రతి తెలంగాణ బిడ్డ మనసును గాయపర్చేలా ఉందన్నారు.

వైద్యవిద్యపై కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

సందేహం వ్యక్తం చేశారు. రెండు బ్లాస్ట్‌ ఫర్నేసులు ఆపేశారని, ఇనుము, బొగ్గు సరఫరా నిలిపేశారని, మూలధనం లేకుండా చేసి అప్పుల పాల్జేశారని తెలిపారు. టాటా స్టీల్‌ కంటే ప్రత్యేక గుర్తింపు కలిగిన విశాఖ ఉక్కును నష్టాల బాటపట్టించారని ధ్వజమెత్తారు. ఉక్కు ఫ్యాక్టరీకి సంబంధించిన 22 వేల ఎకరాల భూమిని అదాని, ఇతర కార్పొరేట్‌ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రాజీనామా చేస్తానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాము పల్లా శ్రీనివాసరావుని, గంటా శ్రీనివాసరావుని రాజీనామా చేయాలని కోరటం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి బయటకు రావాలని సూచించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరుగుతుందనే అనుమానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రం చేత విస్పష్ట ప్రకటన చేయించాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయించాలన్నారు. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యోగ సంఘాలు, వాటి నాయకుల తీరు మారటం లేదన్నారు. పోలీసులు టోపీ, ఖాకీ దుస్తులు ధరించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్‌ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు ఏమైనా తెలుగుదేశం పార్టీలో చేరారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కూడా పోలీసులు ఇలాగే చేశారని ఇప్పుడు ఉన్నతస్థాయికి చెందిన ముగ్గురు ఐపీఎస్‌ అధికారులు సస్పెండ్‌ అయ్యారని తెలిపారు. జగన్‌ చెప్పగానే గుడ్డిగా పాటించటం వల్లే ఇలా జరిగిందన్నారు. పోలీసులకు ప్రభుత్వం మంచి చేస్తే ధన్యవాదాలు చెప్పవచ్చుగాని పాలాభిషేకాలు చేయటం సరికాదన్నారు. ఐపీఎస్‌ల సస్పెన్షన్‌ పోలీసు వ్యవస్థకు గుణపాఠం కావాలన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు వ్యక్తిత్వంతో బతకాలని, బాధ్యతగా ఉండాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్‌ (మాజీ ఎమ్మెల్సీ), జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు.

నేడు నారాయణ సారథ్యంలో

'కొల్లేరు టు బుడమేరు'

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సారథ్యంలో మంగళవారం సీపీఐ బృందం కొల్లేరు నుంచి బుడమేరు వరకు పర్యటించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుడమేరు ఆక్రమణలకు గురికావటంతో వరదలు వచ్చాయని పేర్కొన్నారు. కొల్లేరు కూడా ఆక్రమణలకు గురైందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సారథ్యంలో సెప్టెంబరు 17వ తేదీ కొల్లేరు నుంచి బుడమేరు వరకు సీపీఐ బృందం పర్యటించనున్నట్లు వెల్లడించారు. కృష్ణా, ఎన్టీఆర్‌, ఏలూరు జిల్లాలకు చెందిన సీపీఐ నాయకులు, రైతు సంఘాల నాయకులు ఈ యాత్రలో పాల్గొంటారని చెప్పారు. ఈ యాత్రకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం, రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు బుడమేరు లేకుండా చేద్దామని ప్రయత్నించారని.. అది బెడిసికొట్టిందని చెప్పారు. ఆక్రమణలు ఉన్నా, లేకున్నా బుడమేరు పరివాహక ప్రాంతాన్ని నిర్దేశించి... రిటైనింగ్‌ వాల్‌ నిర్మించాలని రామకృష్ణ సూచించారు.

పెట్టుబడి అవకాశాలు అపారం

(మొదటిపేజీ తరువాయి)

మెగావాట్ల సోలార్‌ సామర్థ్యం పార్కులు రానున్నాయని సీఎం తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సూర్య ఘర్‌ ముఫ్త్‌ బిజిలీ యోజన పథకం ద్వారా ఏపీలో 10 లక్షల ఇళ్లలో రూఫ్‌ టాప్‌ సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వ భవనాలను కూడా సోలార్‌ విద్యుత్‌ కేంద్రాలుగా మారుస్తాం. గతంలో పీపీపీ విధానం అమలు చేశాం. ఇప్పుడు పీ4 విధానాన్ని పరిచయం చేస్తున్నాం. పబ్లిక్‌, ప్రైవేట్‌, పీపుల్స్‌ పార్టనర్‌షిప్‌. పునరుత్పాదక శక్తిలో ప్రజలను భాగస్వాములుగా చేర్చాలని నేను కోరుకుంటున్నాను.

రాష్ట్రంలో కొత్తగా ఇంటిగ్రేటెడ్‌ క్లీన్‌ ఎనర్జీ పాలసీ 2024ను తీసుకువస్తాం. ఈ పాలసీ ముసాయిదా కింద ప్రతిపాదించబడిన ప్రోత్సాహకాలను వివరిస్తూ, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వం పవన విద్యుత్‌ ప్రాజెక్టులు, టర్బైన్‌ తయారీదారుల అభివృద్ధికి కీలకమైన ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఆర్‌ఈ పరికరాల తయారీకి, ఆర్‌ఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రోత్సహించడానికి ట్రాన్స్‌మిషన్‌, వీలింగ్‌ ఛార్జీలను మాఫీ చేస్తుంది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి వాటికి వడ్డీ రాయితీలను అందిస్తుంది. ఆర్‌ఈ పరికరాల తయారీదారులకు ఉత్పత్తి ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. తదుపరి విప్లవం గ్రీన్‌ ఎనర్జీ విప్లవం. దీన్ని భారత దేశం అందిపుచ్చుకోవాలని చంద్రబాబు కోరారు.

అనంతపురంలో సోలార్‌ పార్కుల ఏర్పాటుకు గాను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ కేంద్ర మంత్రి ప్రల్హాద్‌ జోషి నుండి అవార్డును అందుకున్నారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర విద్యుత్‌ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌, ఇతర ఇంధన శాఖ అధికారులు పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. రెన్యువబుల్‌ ఎనర్జీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు పారిశ్రామిక వేత్తలకు వివరించి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

బోట్ల తొలగింపు సవాలే!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద చిక్కుకున్న బోట్ల తొలగింపు అధికారులకు తీవ్ర సవాలుగా మారింది. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా బోట్లను బయటకు తీయలేకపోతున్నారు. సోమవారం ఏడవ రోజూ బోట్ల వెలికితీత పనుల్లో బెకెమ్‌ సంస్థ ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఇప్పటి వరకు అమలు చేసిన నాలుగు వ్యూహాలు విఫలమవడంతో సరికొత్త ప్లాన్‌తో బోట్లను బయటకు తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఒక్కొక్కటి 40 టన్నుల బరువుండి నదిలో ఇసుక డ్రెడ్జింగ్‌ చేసే రెండు భారీ ఇసుక బోట్లను ఇనుప గడ్డర్లతో అనుసంధానించిన ఇంజినీర్లు వాటిని ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్దకు తీసుకువచ్చారు. ఈ రెండు భారీ బోట్లు 300 టన్నులకు పైగా బరువును అవలీలగా లాగేలా గడ్డర్లను అమర్చారు. కృష్ణా నదిలో బ్యారేజీ 67వ గేటు వద్ద చిక్కుకున్న భారీ బోటును పైకి తీసుకువచ్చి రెండు పడవల మధ్య భాగంలో గొలుసులు, రోప్‌లతో గట్టిగా కట్టారు. రెండు పడవలను ఒకేసారి నడుపుతూ చిక్కుకున్న పడవను ఒడ్డుకు లాక్కుని వచ్చేలా ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఆరు రోజులుగా 4 రకాల ప్లాన్లను ఇంజినీర్లు అమలు చేయగా అన్నీ విఫలమయ్యాయి. తొలుత వంద టన్నుల బరువు ఎత్తే రెండు భారీ క్రేన్లతో బోట్లకు కట్టి ఎత్తే ప్రయత్నం చేయగా విఫలమైంది. తర్వాత డైవింగ్‌ టీంలతో బోట్లను రెండు భాగాలుగా ముక్కలు చేసి బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నమూ ఫలించలేదు. భారీ పడవలను వెలికి తీయడంలో అనుభవం ఉన్న కాకినాడకు చెందిన అబ్బులు టీంను రంగంలోకి దింపారు. భారీ పడవలకు రోప్‌లను కట్టి వెనక్కి లాగగా 20 మీటర్ల దూరం వచ్చి ఇసుకలో చిక్కుకుని పైకి రాలేదు. ఆదివారం పొక్లెయిన్‌కు రోప్‌లు కట్టి రోజంతా లాగినా కేవలం 5 మీటర్లు మాత్రమే కదిలి, బయటకు రాకుండా మొరాయించాయి. దీంతో తాజాగా ప్లాన్‌-5ను అమలు చేస్తున్నారు. ఈ ప్రయత్నమైనా సఫలమవుతుందో లేదో చూడాలి.

'రిజిస్ట్రార్‌' రూపురేఖల మార్పు

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్‌ కార్యాలయాల్లో రాచరికపు పోకడల రద్దు కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో కోర్టుల తరహాలో బెంచ్‌లు ఉండటం బ్రిటీష్‌ పాలన నాటి నుంచి ఉంది. ఆధునిక కాలంలో కాలం చెల్లిన వాటిని పూర్తిగా తొలగించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల రూపు రేఖల మార్పునకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు చేరువగా పరిపాలన ఉండాలన్న చంద్రబాబు ఆకాంక్షల మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తీసుకున్న ఈ కీలక నిర్ణయం ఫలితంగా ఇప్పటివరకు రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో ఉన్న విధానాలను సమూలంగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సరళతరమైన సేవలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్పీ సిసోడియా తెలిపారు. ఆ మేరకు పనుల ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త రూపులతో రిజిస్ట్రేషన్‌ కార్యాలయాలు కనిపించేలా చర్యలకు నిమగ్నమయ్యారు.

గుణదలలో పోడియం తొలగింపు

విజయవాడ గుణదల సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో పోడియం తొలగించే కార్యక్రమాన్ని సోమవారం అధికారులు చేపట్టారు. ఆర్పీ సిసోడియా ముఖ్య అతిథిగా హాజరవగా, స్టాంప్స్‌, రిజిస్ట్రేషన్ల ఇన్‌స్పెక్టర్‌ జనరల్‌ ఎం.వి.శేషగిరిబాబు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌, గుణదల జాయింట్‌ సబ్‌ రిజిస్ట్రార్లు కె.ప్రసాద్‌రావు, ఎం.కృష్ణప్రసాద్‌ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రిజిస్ట్రార్‌ ఉండే కుర్చీని నేల ఎత్తుకు మార్చేశారు. ఇటీవల సిసోడియా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాలకు వెళ్లి పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనల నేపథ్యంలో అక్కడి బ్రిటీష్‌ పోకడలను గుర్తించి మార్పులు తప్పనిసరని భావించారు. సబ్‌రిజిస్ట్రార్‌ ముందు సరిపడా కుర్చీలు అందుబాటులో ఉంచడం ద్వారా రిజిస్ట్రేషన్‌కి వచ్చిన ప్రజలు కూర్చుని రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ మార్పులతో రిజిస్ట్రేషన్‌ పూర్తయ్యే వరకు కొనుగోలు, విక్రయ దారులు నిలబడాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇక నుంచి కార్యాలయానికి వచ్చిన వారు నిల్చోవలసిన అవసరం లేదు. లావాదేవీల సమయంలో సబ్‌ రిజిస్ట్రార్‌ సమక్షంలో కూర్చునే పని పూర్తి చేయించుకోవచ్చు.

ఇది గొప్ప సంస్కరణ : ఆర్పీ సిసోడియా

సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో రూపు రేఖలను మార్చడం గొప్ప సంస్కరణగా తాను భావిస్తున్నానని, ప్రజలకు ప్రభుత్వ అధికారులు ఎప్పుడూ సేవకులేనని రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండేదని, నా చిన్నప్పుడు చాలా మంది బ్యాంకులకు వెళ్లాలన్నా భయపడే వారన్నారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వచ్చి నేరుగా తమ అభిప్రాయాలు చెబుతున్నారన్నారని అన్నారు. సీఎం చంద్రబాబు... ప్రభుత్వ అధికారులను ప్రజా సేవకు ముందుండాలని ఆదేశించారని సిసోడియా చెప్పారు. ప్రభుత్వానికి ఆదాయ వనరులు కల్పిస్తున్న క్రయి విక్రయదారులను ఎంతో మర్యాద పూర్వకంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రిజిస్ట్రార్‌, సబ్‌ రిజిస్ట్రార్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆసనాలు, పోడియాలను తొలగించి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు కల్పించే తరహాగా సౌకర్యాలు చేపడుతున్నామని చెప్పారు.

వివిధ పనులపై వచ్చే ప్రజలను మర్యాదగా చూస్తూ... వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ క్రయ, విక్రయదారులకు సేవలందించాలని సిసోడియా ఆదేశించారు.

ఢిల్లీ కొత్త సీఎం ఎంపికపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

కోరగా... ఆయన మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సమయం ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆప్‌ శాసనసభాపక్షం రేపు ఉదయం 11.30 గంటలకు కేజ్రీవాల్‌ అధికారిక నివాసంలో సమావేశం కానుంది. కాగా ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసేందుకు ఆమ్‌ ఆద్మీ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా కేజ్రీవాల్‌ సోమవారం వరుస సమావేశాలు నిర్వహించారు. ముందు ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, సీనియర్‌ నేత మనీశ్‌సిసోడియా భేటీ అయ్యారు. ఆ తర్వాత ఆప్‌ కీలక నేతలతో విడివిడిగా భేటీలు నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆప్‌నేత సౌరభ్‌ భరద్వాజ్‌ విలేకరులతో మాట్లాడుతూ... కేజ్రీవాల్‌ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులను కలిశారని...కొత్త ముఖ్యమంత్రి కోసం అన్వేషణలో వారి అభిప్రాయాలను తీసుకున్నారని చెప్పారు. 'నిన్న, కేజ్రీవాల్‌ జీ రేపు తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. దీనికి సంబంధించి ఆప్‌ పీఏసీ సమావేశం నిర్వహించారు. దీనికి ఢిల్లీలోని సీనియర్‌ నాయకులు, కేబినెట్‌ మంత్రులందరినీ పిలిచారు' అని భరద్వాజ్‌ చెప్పారు. దీనికి కొనసాగింపుగా మంగళవారం ఎమ్మెల్యేలతో నిర్వహిస్తారని భరద్వాజ్‌ చెప్పారు. ఈ సమావేశంలో కొత్త సీఎంగా ఎవరిని పెట్టాలో ప్రతిపాదించి చర్చించే అవకాశం ఉంది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టై కొన్ని నెలలపాటు జైలులో ఉండి ఇటీవలే విడుదలైన కేజ్రీవాల్‌ సీఎం పదవికి రాజీనామా చేస్తున్నానంటూ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలు తనకు సర్టిఫికెట్‌ ఇచ్చేంత వరకూ ముఖ్యమంత్రి పదవిలో ఉండబోనని స్పష్టం చేశారు. రెండు రోజుల తర్వాత దిగిపోయి... మధ్యంతర ఎన్నికలకు వెళ్లి ప్రజల్లో తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని ప్రకటించారు. కేజ్రీవాల్‌ సతీమణి సునీత కేజ్రీవాల్‌, మంత్రులు అతిశీ, గోపాల్‌ రాయ్‌లలో ఒకరు ముఖ్యమంత్రి అవుతారని వార్తలొస్తుండగా... వీరితోపాటు మంత్రులు కైలాశ్‌ గెహ్లోత్‌, సౌరభ్‌ భరద్వాజ్‌ పేర్లూ వినిపిస్తున్నాయి. దళిత నేతనుగానీ, మైనారిటీ నేతనుగానీ ముఖ్యమంత్రిని చేసే అవకాశమూ లేకపోలేదని తెలుస్తోంది.

రాజధాని రైతులకు కౌలు డబ్బులు

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో కౌలు చెల్లింపునకు ఆటంకాలు ఎదురవ్వగా... ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం సజావుగా ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పదేళ్లపాటు కౌలు చెల్లించాలన్న ఒప్పందం గడువు ముగియడంతో... మరో ఐదేళ్లపాటు దానిని పొడిగించింది. కౌలు డబ్బులు విడుదలపై రాజధాని ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల కళాశాలలో గుంజీలు

- 64 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలు
- ప్రిన్సిపాల్ నిర్వాకంపై భగ్గుమన్న గిరిజన సంఘాల నేతలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: గురుకుల కళాశాలలో విద్యార్థినులను గుంజీలు తీయించిన ఘటన ఆందోళనకు దారితీసింది. దాదాపు 64 మంది విద్యార్థినులు నడవలేని స్థితిలో ఉండటంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వివరాల్లోకి వెళితే... అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని స్థానిక గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో క్రమశిక్షణ పేరుతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన ఒక్కొక్క విద్యార్థినితో 200 గుంజీలు తీయించడం కలకలం ంపింది. విద్యార్థినులు గుంజీలు తీసి నీరసించి పోవడంతో 64 మంది ఆస్పత్రి పాలయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన క్రమశిక్షణ పేరుతో గుంజీలు తీయించారనే విషయం విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు, సంఘం జిల్లా నాయకులు మట్ల వాణిశ్రీ, సిరిమల్లె రెడ్డి, కంభం శాంతి రాజు సోమ వారం ఉదయం కళాశాలను సందర్శించ డానికి వెళ్లారు. అయితే గిరిజన సంఘం నాయకులు, తల్లిదండ్రులు కళాశాలలోకి వెళ్లడానికి ప్రిన్సిపల్ నిరాకరించడంతో వారు ఆందోళనకు దిగారు. విద్యార్థినులతో గుంజీల్లో తీయించారని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు వచ్చిందని, అందుకే కళాశాలను సందర్శించడానికి వచ్చామని గిరిజన సంఘం నాయకులు ప్రిన్సిపాల్‌తో వాదనకు దిగారు. అటువంటిది ఇక్కడ జరగలేదన్న ప్రిన్సిపాల్... విద్యార్థినులతో సైతం మాట్లాడేందుకు నిరాకరించారు. దీంతో ప్రిన్సిపాల్ వైఖరికి నిరసనగా గిరిజన సంఘం నేతలతో పాటు విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ ప్రతి చిన్న విషయానికి తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఏ చిన్న తప్పు చేసినా సుమారు 100 నుంచి 200 వరకు గుంజీలు తీయిస్తున్నారని ఆరోపించారు. గురువారం సాయంత్రం పాలు తాగేందుకు లేటుగా వచ్చామని డైనింగ్ హాల్‌లోకి తీసుకువెళ్లి ఒక్కొక్క విద్యార్థినితో 200 గుంజీలను తీయించారని, అప్పటి నుంచి అనేక మంది విద్యార్థినులు నడవలేని పరిస్థితిలో ఉన్నారని, అయినా వారిని ఆస్పత్రికి తీసుకువెళ్లలేదని వివరించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇస్తే ఊరుకునేది లేదని తమను భయపెట్టారన్నారు. అందుకే ఈ విషయం బయటకు తెలియజేయలేదని విద్యార్థినులు తెలిపారు. ఆదివారం పిల్లలను కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లల పరిస్థితిని చూసి చలించిపోయి గిరిజన సంఘం నాయకుల ముందు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థినులను క్రమశిక్షణ పేరుతో గుంజులు తీయించిన విషయమై ప్రిన్సిపల్‌ని ప్రశ్నించగా, అసలు తీయించలేదని వాదించారని, అంతేకాకుండా తమను కళాశాలను సందర్శించి బాధిత విద్యార్థినులతో మాట్లాడేందుకు కూడా నిరాకరించారని తెలిపారు. అయితే విద్యార్థినులతో తాము మాట్లాడినప్పుడు వారందరూ ముక్తకంఠంతో ప్రిన్సిపల్ గుంజీలు తీయించారని, తాము నడవలేని స్థితిలో ఉన్నామని తెలిపారని ఆయన వివరించారు. ఇటువంటి సంఘటనలు తరచూ ఎన్ని బయటికి వస్తున్నా కళాశాలలో అధ్యాపకులు మాత్రం ఎటువంటి బాధ్యత, భయం లేకుండా వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఐటీడీఏ కేంద్రానికి కూత దూరంలో ఉన్న కళాశాలలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మారుమూల ప్రాంతాలలోని కళాశాలల పాఠశాలల పరిస్థితి ఎలా ఉందో అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాల ప్రిన్సిపల్, పీడీని తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ విద్యార్థినులపై వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్, పీడీని మరల ఈ కళాశాలకు రాకుండా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే వేధించిన అధ్యాపకులపై కఠిన చర్యలు తీసుకుని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అనంతరం సుమారు 64 మంది విద్యార్థులను 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు.

వరద బాధితులకు అండగా వీఆర్ఏ సంఘం

విశాలాంధ్ర-విజయవాడ: వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సేవకుల సంక్షేమ, సేవా సంఘం అధ్వ ర్యంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రెవిన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్ఏలు ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకొని ప్రజాసేవకు సంకల్పించడం హర్షణీయమన్నారు. వరదబాధితులకు సరుకులు ఇచ్చి ఆదుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. రెండు రోజులు పాటు విజయవాడ నగరంలోని బుడమేరు వరదలో దెబ్బతిన్న జక్కంపూడి, చెత్త డంపింగ్ యార్డు, అజిత్ సింగ్ నగర్, వాటర్ ట్యాంక్ కాలనీల్లో అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పర్యటించి బాధితులను గుర్తించి... వారికి 12 రకాలు నిత్యావసర సరుకులు కలిగిన కిట్టుతో పాటు మహిళలకు దుస్తులు, వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి కోడూరు పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల నాగసుబ్బయ్య యాదవ్, షేక్.బాషా, బాణాల శ్రీనివాసులు, గుర్రాల హరికృష్ణ, రాయల్ లక్ష్మీ నరసయ్య, రమాదేవి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య ఫీజులపై విచారణ జరపాలి

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ద్వారా కన్వీనర్ కోటా అనుమతి పొందిన కొత్త ప్రైవేటు విశ్వవిద్యాల యాలకు, ఇంజనీరింగ్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల మధ్య ఫీజుల నిర్ణయం భారీ వ్యత్యాసంతో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా సమగ్ర విచారణ జరపాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కన్వీనర్ కోటా కింద ఇంజనీరింగ్ కోర్సు ఫీజు రూ.1,03,000, బిల్డింగ్ ఫీజు రూ.37,000, ఐటీ ఫీజు రూ.8,000, బస్సు ఫీజు రూ.26,000, యూనిఫామ్ ఫీజు రూ.10,500, డే స్కాలర్ మెస్ ఫీజు రూ.20,000 మొత్తం చెల్లించాల్సింది రూ.2,05,000గా ఉందన్నారు. ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. 2023-24 సంవత్సరంలో గుర్తింపు పొందిన నాలుగు విశ్వవిద్యాలయాలకు ఒక రకమైన ఫీజు, పాత ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు ఒక రకమైన ఫీజు, ఒక్కో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు ఒకొక్క రకమైన ఫీజు, ఇంజనీరింగ్ కోర్సులకు మరో రకమైన ఫీజులు ఉన్నాయని తెలిపారు. కనిష్ఠంగా ఫీజు రూ.43,000, గరిష్ఠంగా లక్ష రూపాయలను సిఫార్సు చేసినట్లు నివేదికలు సూచిస్తున్నాయన్నారు. ఎక్కువ కళాశాలలు రూ.43 వేలు కేటగిరీ కిందకు వస్తాయని వివరించారు. ఈ ఫీజుల విషయంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మోల్డ్‌టెక్ రూ.25 లక్షల విరాళం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారు. మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు ఆదివిష్ణు సందీప్ వరద బాధితుల సహాయార్థం రూ.25 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు సోమవారం అంద జేశారు. వరద బాధితుల కోసం పెద్దఎత్తున స్పందిస్తున్న పారిశ్రామికవేత్తలకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో దాతలు అండగా నిలవడం అభినందనీయం అన్నారు.

దేశం గర్వించదగ్గ నేత ఏచూరి
సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు ఉండాలని సైద్ధాంతిక సిద్ధాంతాలతో పోరాడిన దేశం గర్వించదగ్గ గొప్ప రాజనీతిజ్ఞుడు, ప్రజా పోరాట యోధులు, సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరిని కోల్పోవడం బాధాకరమని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ లోక్‌సభాపక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికై రాజకీయాలలో ప్రవేశించి, అంచెలంచలుగా ఎదిగి తెలుగువాడైనా సీతారాం ఏచూరి సీపీఎం జాతీయ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నికవడం గొప్ప విషయమని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వామపక్ష పార్టీలు వారి భావ జాలాలలో, ఆచరణలో పునరాలోచన చేసుకోవాలన్నారు. అదేవిధంగా వామపక్షాల ఐక్యత పెరగాలని కోరారు. 1986లో జ్యోతిబసు ప్రధాని అయ్యే అవకాశాన్ని వదులుకోవడం చారిత్రక తప్పిదమని, 2004లో వామపక్ష పార్టీలకు 60 మందికి పైగా పార్లమెంటు సభ్యులున్నా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కాకపోవడం మరో తప్పిదమని తెలిపారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 1977 నుంచి 2024 మధ్య దేశ రాజకీయాలలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని, ఉమ్మడి కనీస కార్యక్రమం రూపకల్పనకు కృషి చేశారని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు జేడీ శీలం మాట్లాడుతూ సీతారాం ఏచూరితో కలిసి రాజ్యసభలో 11 సంవత్సరాల పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలపై చర్చించుకునే వారమని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ వామపక్షాల ఐక్యత కోసం కృషి చేస్తూనే దళిత, గిరిజన, బలహీన వర్గాల హక్కులను కాపాడటంలో అగ్రభాగాన ఉండేవారని అన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో లౌకికవాదం, సమాఖ్యవాదం, ప్రజాస్వామ్య విలువల కోసం ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ పోరాటాన్ని సీతారాం ఏచూరి నిర్వహించారని తెలిపారు. తొలుత ప్రజా గాయకులు పీవీ రమణ... సీతారాం ఏచూరి జీవిత విశేషాలపై ఆలపించిన పాట సభికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్ శర్మ, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, చరిత్ర సంఘ అధ్యక్షులు ప్రొఫెసర్ శామ్యూల్, ఎల్ఐసీ యూనియన్ నేత సురేష్, చావ శివాజీ, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే, విమానయాన రంగాల్లో ఏపీకి ప్రాధాన్యం

విశాఖ-దుర్గ్ వందేభారత్ ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఏపీలో రవాణాకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రైల్వే... పౌర విమానయాన రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యత కల్పిస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధాని మోదీ... సోమవారం రాయ్‌పూర్ (దుర్గ్)-విశాఖపట్నం మధ్య వందేభారత్ రైలుతో పాటు అనేక ప్రాంతాలకు వెళ్లే వందేభారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ వేదికగా విశాఖపట్నం-దుర్గ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20830)ను ... విశాఖ ఎంపీ శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు, స్థానిక ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గనబాబు, విష్ణుకుమార్ రాజు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, రైల్వే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామ్మోహన్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. విశాఖపట్నం మీదుగా నడిచే నాలుగో వందే భారత్ రైలు ఇది అని కేంద్ర మంత్రి చెప్పారు. రైల్వే ద్వారా దేశంలో అభివృద్ధి శరవేగంగా జరిగిందని తెలిపారు. విశాఖలో నాలుగు వందే భారత్ రైళ్లను ప్రారంభించినట్లు వివరించారు. ఇది కనెక్టివిటీని మెరుగుపరుస్తుందని, ఈ ప్రాంతం సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

విశాఖపట్నం- సికింద్రాబాద్, భువనేశ్వర్-విశాఖపట్నం మధ్య రెండు వందేభారత్ రైళ్లకు అదనంగా ఇది విశాఖపట్నం నుంచి నాల్గవ వందే భారత్ అవుతుంది. రాయ్‌పూర్-విజయనగరం మార్గంలో ఇది మొదటి వందేభారత్ ప్రారంభోత్సవం చేయడం పై ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. 20829/20830 దుర్గ్-విశాఖపట్నం-దుర్గ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ... దుర్గ్-విశాఖపట్నం (20829) వందే భారత్ దుర్గ్ నుంచి వారానికి ఆరు రోజులు (గురువారాలు మినహా) ఉదయం 5.45 గంటలకు బయలుదేరుతుంది. అదే రోజు 13.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం-దుర్గ్ (20830) వందే భారత్ విశాఖపట్నం నుంచి వారానికి ఆరు రోజులు (గురువారాలు మినహా) 14.50 గంటలకు బయలుదేరుతుంది. అదే రోజు 22.50 గంటలకు దుర్గ్ చేరుకుంటుంది. ఈ నెల 20వ తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుంది. రాయ్‌పూర్, మహాసముంద్, ఖరియార్ రోడ్, కాంతబంజి, టిట్లాగర్, కేసింగ, రాయగడ, పార్వతీపురం, విజయనగరంలో ఆగుతుంది.

సీబీఎస్‌సీ కొనసాగించకుంటే ఉద్యమం: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈ సిలబస్‌ను యథాతథంగా కొనసాగించాలని, లేకుంటే ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ రద్దు సరికాదన్నారు. చంద్రబాబు నెమ్మదిగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాటువేయడానికి పడగ విప్పుతున్నారని, పేదలకు ఉచిత విద్య, వైద్యం జీవనాడి లాంటివని, అలాంటి రెండింటినీ ప్రైవేట్ పరం చేయడానికి కుట్ర జరుగుతోంద న్నారు. సీబీఎస్ఈ సిలబస్ ఉండాలని ఢిల్లీకి వెళ్లి, ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు కోరుకుంటున్నారని, తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారని తెలిపారు. దళిత, వెనుకబడిన, మైనార్టీ, బలహీన వర్గాలైన పేద పిల్లలు చదుఉకునే ప్రభుత్వ పాఠశాలను రక్షించాల్సిన ప్రభుత్వం ... నిర్లక్ష్యంతో నాశనం చేసే ప్రయత్నం సరికాదన్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలవుతున్నప్పటికీ... అలాంటి పరిస్థితుల్లో ఎలా నిర్ణయిస్తారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు అయోమయం, గందరగోళంగా మారిందన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పుడు స్టేట్ సిలబస్ బోధిస్తే విద్యార్థులకు సబ్జెక్టు అర్థకాక తప్పే ప్రమాదముందని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

సీబీఎస్ఈ విద్యకు చంద్రబాబు గండి

మాజీ సీఎం వైఎస్ జగన్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ రద్దు నిర్ణయంతో మరోసారి చంద్రబాబు పేదల వ్యతిరేకిగా నిరూపించుకున్నారని, తద్వారా నాణ్యమైన సీబీఎస్ఈ విద్యకు గండికొడుతున్నారని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విమర్శించారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలను మళ్లీ మొదటికే తీసుకువెళుతున్నారని తెలిపారు. మీ ఇళ్లల్లో పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, ప్రభుత్వ పాఠశాలల పిల్లల విషయంలో వివక్ష ఎందుకు? వాళ్లు ఎప్పటికీ కింద స్థాయి లోనే ఉండిపోవాలా? వారి జీవితాలకు మీరు శాపంపెట్టిన మాదిరిగా ఈ నిర్ణయాలు ఏమిటని' 'ఎక్స్' వేదికగా సోమవారం జగన్ ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోకపో వడంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే కార్యక్రమాలను రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని, సీఎంగా మీరు 14 ఏళ్ల కాలంలో చేయలేని పనులన్నీ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిందని గుర్తు చేశారు. నాడు-నేడు, ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ, ఐబీవైపు అడుగులు, టోఫెల్, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, తరగతి గదుల్లో 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 8వ తరగతి వచ్చే సరికే ట్యాబ్‌ల పంపిణీ, విద్యాకానుక, రోజుకో మెనూతో గోరుముద్ద... ఇలా పేద పిల్లల తలరా తలను మార్చే చదువులను అందించడానికి వైసీపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు. 'మీ పార్టీ నాయకు లకు చెందిన ప్రైవేటు స్కూళ్లు బాగుం డాలి?, గవర్నమెంటు స్కూళ్లు నిర్వీర్యం అయిపోవాలి?' అనేదే మీ ఉద్దేశ్యమా?' అని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలు, అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులు దేనిలోనూ తక్కువకాదని, వాళ్లంతా తెలివైన వారని, పైగా ప్రభుత్వ టీచర్లు లక్షల మంది పోటీపడే పరీక్షల్లో ఉత్తీర్ణులై, చక్కటి శిక్షణ కూడా పొందినవారని వివరించారు. పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే ఆయుధం చదువు మాత్రమేనని, వెంటనే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే తప్పుడు పనులు మానుకోవాలని, మేం తీసుకొచ్చిన సంస్కరణలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

విద్యారంగ నిపుణులే వీసీలు

పరిశోధనలు, ర్యాంకింగ్స్ మెరుగుపర్చడమే లక్ష్యం: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిన విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీనిలో భాగంగా రాజకీయాలకు అతీతంగా విద్యారంగ నిపుణులను వీసీలుగా నియమించేందుకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. పరిశోధనపై దృష్టి సారించి, ర్యాంకింగ్స్ మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్సిటీలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలన్న సంకల్పం ఉన్న ఆచార్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28 చివరి తేదీ అని ఆయన తన ఎక్స్(ట్విటర్)లో పేర్కొన్నారు.

జగన్... విద్యపై మాట్లాడటం హాస్యాస్పదం

ఏం చదివావో తెలియదు... ఎక్కడ చదివావో అస్సలు తెలియదు... నువ్వు విద్యాశాఖ గురించి మాట్లాడడం వింతగా ఉంది ఫేక్ జగన్ అని విమర్శిస్తూ మరో పోస్ట్ పెట్టారు. కనీస అవగాహన లేకుండా రాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం మీరు తీసుకున్న నిర్ణయం 1000 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పాలిట శాపంగా మారింది. సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయడానికి అవసరమైన సామర్థ్య పెంపు, ఉపాధ్యాయులకు ఎటువంటి శిక్షణ ఇవ్వకుండానే పరీక్షా విధానం మార్చడం వలన పదో తరగతి చదువుతున్న 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఆత్మలతో కాకుండా నిపుణులతో చర్చించి వచ్చే విద్యా సంవత్సరం 6వ తరగతి నుంచే పరీక్షా విధానంలో మెల్లగా మార్పులు తీసుకొచ్చి సీబీఎస్ఈ లో పరీక్షలు రాసేందుకు సిద్ధం చేస్తాం. గుడ్లు, చిక్కి, ఆఖరికి ఆయమ్మల జీతాలు కూడా బకాయి పెట్టి పోయిన కంసమామ అయిన మీరు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాను అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. అన్నట్టు మీరు అంత ఉద్ధరిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గినట్టో సెలవివ్వండి అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు.

బాణసంచా కేంద్రంలో భారీ పేలుడు

- 14 మందికి గాయాలు... ఒకరి పరిస్థితి విషమం
- అమలాపురంలోని రావుల చెరువులో ఘటన
- బాధితులను పరామర్శించిన మంత్రి సుభాశ్

విశాలాంధ్ర-అమలాపురం: అమలాపురంలోని రావుల చెరువులో ఒక ఇంటిలో బాణసంచా తయారు చేస్తుండగా సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా మరో ఏడుగురికి స్వల్ప గాయాల య్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలా పురం పట్టణ పరిధిలోని రావులచెరువులో బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో రెండంతస్తుల భవనం కుప్పకూలగా భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళ నలకు గురయ్యారు. బాణసంచా తయారీ చేసే ఇంటిలో ఉన్న ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా పక్కనే ఉన్న ఇంటిలో నివాసితులు ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అమలాపురం ఏరియా, కిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లతో పాటు బాణాసంచా పేలుడు ధాటికి రెండం తస్తుల భవనం ధ్వంసం కాగా, పక్కనే ఉన్న ఇంటి గోడలు కూడా దెబ్బతిన్నాయి. పేలుడు ధాటికి ఒక్కసారిగా భయభ్రాంతు లకు గురై పరుగులు తీశామని స్థానికులు చెప్పారు. ఇంట్లో దీపావళి మందు గుండు సామాగ్రి తయారు చేయడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని వారు చెబు తున్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే పట్టణ సీఐ వీరబాబు హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆర్డీవోతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని కోరారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాద కారణాలను విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్డీవో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కూడా పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

గ్రామసభల నిర్వహణలో ప్రపంచ రికార్డు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ సభల నిర్వహణలో ప్రపంచ రికార్డు నెలకొంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లోపే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రపంచ రికార్డ్ కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. వరల్డ్ రికార్డ్స్ యూనియన్... రాష్ట్రంలో ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామ సభలను గుర్తించింది. దీనికి సంబంధించిన రికార్డ్ పత్రాన్ని, మెడల్‌ను సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వరల్డ్ రికార్డ్స్ యూనియన్ అఫిషియల్ రికార్డ్స్ మేనేజర్ క్రిస్టఫర్ టేలర్ క్రాఫ్ట్ అందజేశారు. హైదరాబాద్‌లోని పవన్ వాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకే రోజు ఈ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సభలు నిర్వహించడం అతి పెద్ద గ్రామ పాలనగా గుర్తిస్తున్నట్లు వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రతినిధి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్
(Regd. No. AMC/KNA/DCO/2016/122)
డోర్.నెం : 54-16-3/3, ప్లాట్ నం. 48: రోడ్డు నెం.3. లయోలా గార్డెన్స్, విజయవాడ-520 008.
Ph : 0866-2452129 e-mail : housing.emp@gmail.com, www.aphousingsociety.com

Notice.No.AGM/2/2024 — వార్షిక సర్వసభ్య సమావేశపు నోటీసు — Dated : 15-09-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ (రిజిస్టర్ నంAMC/KNA/DCO/2016/122) విజయవాడ వారి యొక్క వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ది. **29-09-2024** ఆదివారం రోజున మధ్యాహ్నం **02.30** గం.లకు సొసైటీ యొక్క కేతనకొండ, శ్రీహరిపురం లే-అవుట్ స్థలము, ఇబ్రహీంపట్నం మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా యందు నిర్వహించుటకు నిర్ణయించబడినది. కావున సొసైటీ సభ్యులు అందరూ తప్పనిసరిగా సదరు సర్వసభ్య సమావేశములో పాల్గొని, సమావేశాన్ని దిగ్విజయం చేయవలసినదిగా కోరడమైనది. మీటింగు నోటీసు, అజెండాతో సహా సభ్యులకు పోస్టుద్వారా పంపించబడ్డాయి. సభ్యుల వ్యక్తిగత ఈ-మెయిల్, వాట్సప్‌ల ద్వారా కూడా పంపించడుతున్నాయి. సొసైటీ సభ్యులు అందరూ సదరు సర్వసభ్య సమావేశములో పాల్గొని సమావేశాన్ని దిగ్విజయం చేయవలసినదిగా కోరడమైనది.

(సొసైటీ బోర్డు ఆమోదంతో జారీ చేయబడినది)
సం/- అద్దాల సుబ్బరాజు, అధ్యక్షుడు

సంపాదకీయం

కేజ్రీ పాదుకా పట్టాభిషేక రాజకీయం

మద్యం విధానం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్‌కు చివాట్లు పెట్టి దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. కానీ ఆ వెంటనే ఆయనను సీబీఐ అరెస్టు చేసింది. చివరకు మూడు రోజుల కింద కేజ్రీవాల్‌కు తీహార్ జైలు నుంచి విముక్తి లభించింది. బెయిలు లభించడం కేజ్రీవాల్‌కు పెద్ద ఊరటే. దాదాపు ఆరు నెలలు జైలు జీవితం గడిపిన తరవాత బెయిలు మీద విడుదలైన కేజ్రీవాల్ అత్యంత ఆశ్చర్యకరమైన నిర్ణయం తీసుకున్నారు. తాను రెండు రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని, తన స్థానంలో మరో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులొకరు ఆ స్థానంలో ఆశీనులవుతారని ప్రకటించారు. ఆయన మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి రాజీనామా లేఖ అందజేయవచ్చు. తనను ప్రజలు నిర్దోషిగా భావిస్తే తప్ప ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోనని కేజ్రీవాల్ ప్రకటించారు. నవంబరులో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలతోపాటు దిల్లీ శాసనసభకు కూడా ఎన్నికలు నిర్వహించేలా చూడాలన్నది కేజ్రీవాల్ ఆంతర్యం. ఇంకా విచిత్రం ఏమిటంటే కేజ్రీవాల్ శాసనసభ రద్దుకు సిఫార్సు చేయలేదు. ఎన్నికలు జరిగినప్పుడు ప్రజలు తనకు, తన పార్టీకి ఓటువేసి గెలిపిస్తేనే తాను ముఖ్యమంత్రి స్థానంలో ఉంటానని, లేకపోతే లేదని కేజ్రీవాల్ అంటున్నారు. అంటే తాత్కాలికంగా ఇప్పుడు ఎవరు ముఖ్యమంత్రి అయినా ఎన్నికలు జరిగి ప్రజాతీర్పు ఆమ్ ఆద్మీ పార్టీకి అనుకూలంగా ఉంటే తానే ముఖ్యమంత్రిని అవుతానని కేజ్రీవాల్ స్పష్టంగానే చెప్తున్నారు. మద్యం కేసులో న్యాయస్థానాల తీర్పు ఎలా ఉన్నా ప్రజాకోర్టులో తాను నిర్దోషినని నిరూపించుకుంటే ఇక తనకు ఏ ప్రమాదమూ ఉండకుండా చూడడానికే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానంటున్నారు. ఎన్నికల తరవాత తానే ముఖ్యమంత్రి కావాలంటే తాత్కాలికంగా ముఖ్యమంత్రి పదవి చేపట్టినవారు కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కావడానికి వీలుగా తప్పుకోవలసిందే. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఉన్న హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేస్తారని నికరంగా తేలిపోయిన తరవాత ఆయన రాజీనామాచేసి చంపై సొరేన్‌ను ఆ స్థానంలో కూర్చోబెట్టి వెళ్లారు. ఆయన జైలు నుంచి విడుదలైన తరవాత చంపై సొరేన్ ముఖ్యమంత్రి స్థానం నుంచి తప్పుకున్నారు అనడం కన్నా హేమంత్ సొరేన్ తప్పించారు అనడమే వాస్తవం. ఆ తరవాత చంపై సొరేన్ అలిగారు. చివరకు బీజేపీలో చేరిపోయారు. రేపు ఎప్పుడైనా హేమంత్ సొరేన్ పార్టీ ఎన్నికలలో ఓడిపోయి బీజేపీకి ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం వస్తే ముఖ్యమంత్రి పదవి తనకే దక్కుతుందన్న ఆశతోనే చంపై గోడ దూకేశారు. ఇప్పటికే జార్ఖండ్‌లో అనుభవజ్ఞులైన, అధికారం మీద ఆశ పెంచుకున్న నాయకులు బీజేపీలో ఉన్నారు. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు తాజాగా మధుకోడాను కూడా బీజేపీ తమ పార్టీలో చేర్చుకుంది. అంటే చంపై సొరేన్ ఆశలు నీరుగారినట్టే. నితీశ్ కుమార్ కూడా ఒక సందర్భంలో జితిన్ రాం మాంఝీని తన స్థానంలో కూర్చోబెట్టారు. మళ్లీ రాజీనామా చేయమనే సరికి మాంఝీ అలిగారు. కొత్త పార్టీ పెట్టుకున్నారు.

ఈ పరిణామాలన్నీ చూస్తే ప్రాంతీయ పార్టీలను, ఒకటో రెండో రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలను చీల్చడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని తేలిపోతుంది. 2015 నుంచి దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించడం బీజేపీకి సాధ్యం కాలేదు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులకు లోపాయికారీగా డబ్బు సంచుల ఆశ చూపించాలన్న బీజేపీ ఎత్తుగడ పారలేదు. అందువల్ల ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులందరూ అవినీతిపరులేనని నిరూపించడానికి ఆ పార్టీకి చెందిన మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, చివరకు ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణంలో అరెస్టు చేశారు. దీనికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, సీబీఐని మోదీ సర్కారు పరిచారికలుగా వాడుకుంది. ఈ రెండు సంస్థల పని తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పు పట్టింది. నిజానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ కోరలు తీసేసింది. ఈ నేపథ్యంలోంచి చూస్తే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కేజ్రీవాల్ నిర్ణయం వెనక పెద్ద వ్యూహం ఏదో ఉందని అనుకోవాల్సి వస్తుంది. రాజీనామా చేయడానికి కేజ్రీవాల్ పెట్టుకున్న ముహూర్తానికీ ఓ విశిష్టత ఉంది. మంగళవారం అంటే సెప్టెంబర్ 17న రాజీనామా చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. 17వ తేదీన రాజీనామా చేయడం అంటే ప్రధానమంత్రి మోదీ జన్మదినం రోజుననే రాజీనామా చేయాలని సంకల్పించారు. జన్మదినోత్సవం రోజున మోదీకి మానసిక ప్రశాంతత లేకుండా చేయడం మాత్రమే కేజ్రీవాల్ ఉద్దేశం కాదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బెయిలుమీద విడుదలైనప్పుడు సెప్టెంబర్ 17 తరవాత మోదీ ప్రధానమంత్రిగా ఉండబోరని కేజ్రీవాల్ ప్రకటించారు. ఎందుకు అంటే 75 ఏళ్ల తరవాత పదవిలో ఉండకూడదన్న నియమం పెట్టింది మోదీయే కనక ఆ నియమాన్ని పాటించాలని కేజ్రీవాల్ పరోక్షంగా గుర్తు చేస్తున్నారన్న మాట. అయినా ఈ తాటాకు చప్పుళ్లకు మోదీ జడవరుగా! ఏమైనా జనాన్ని ఊరించడంలో కేజ్రీవాల్‌ను మించినవారు లేరు. జైలులో పెట్టినప్పుడు రాజీనామా చేయకుండా జైలునుంచే పరిపాలిస్తానని భీష్మించిన కేజ్రీవాల్... తీరా బెయిలు మంజూరు అయిన తరవాత రాజీనామా చేస్తాననడం జనం సానుభూతి సంపాదించే ఎత్తుగడే. కేవలం ఆరోపణలు ఎదుర్కొంటూ జైలులో ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించకూడదని రాజ్యాంగంలోగానీ, మరే చట్టంలోగానీ లేదు. అందుకే న్యాయస్థానాలు జైలు నుంచే పరిపాలిస్తానన్న కేజ్రీని అభ్యంతర పెట్టలేదు. కానీ అత్యున్నత న్యాయస్థానమూ భిన్నంగానే వ్యవహరించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చినట్టే ఇచ్చి ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్ల కూడదనీ, ఫైళ్లు చూడకూడని, సంతకాలు చేయకూడదని ఆంక్ష విధించింది. ఇందులో న్యాయస్థానం ఉద్దేశం నిర్బంధంలో ఉన్న వ్యక్తి జైలు నుంచి పరిపాలన కొనసాగించవచ్చునా లేదా కచ్చితంగా తేల్చి చెప్పడం కాదు. బెయిలు మంజూరుకు షరతులు విధించడం మాత్రమే. అత్యున్నత న్యాయస్థానానికి అంతర్నిహితంగా ఉన్న పరిమితులను పసిగట్టిన కేజ్రీవాల్ బెయిలు మంజూరు అయిన తరవాత రాజీనామా చేయాలనుకోవడం మద్యం కేసులో న్యాయస్థానాల తీర్పు ఎలా ఉన్నప్పటికీ ఎన్నికలు ఎదుర్కొని మళ్లీ విజయం సాధించగలిగితే ప్రజాకోర్టులో నిర్దోషిగా తేలానని చెప్పుకోవడానికే. నైతికంగా ఉన్నతాసనం ఎక్కినట్టూ ఉంటుంది. ఎన్నికలకు ఆరునెలల ముందు రాజీనామాచేసి త్యాగ నిరతిని నిరూపించుకున్నట్టు ఉంటుంది. ఇలాంటి ఎత్తుగడలలో మోదీ ఒక్కడే కేజ్రీవాల్‌కు పోటీగా నిలవగలరేమో! పాదుకా పట్టాభిషేక రాజకీయాలు అంటే ఇవే.

వెర్రి అభిమానం

చింతపట్ల సుదర్శన్

తొమ్మిది రోజులు పూజలుచేసి ఇవ్వాళ వినాయకుణ్ణి నిమజ్జనం చేస్తున్నారు. ఎంత బాధగా ఉందో ఏడుపు ఆగడంలేదు నాకు అంది డాగీ. అవును ఊరూ వాడా ఒకటే హడావిడి. తీన్‌మార్ దప్పుల మోత, డాన్సుల హోరు చెవులు చిల్లు పడేట్టున్నవి. వినాయకుడి లడ్డూలు వేలం పాటలో వేలూ లక్షలూ పోసి కొన్న మనుషులు వినాయకుడ్ని చెరువులో ముంచేందుకు బాధపడరు కానీ నీకెందుకు బాధా దుఃఖమూ? ఎందుకంటే ఏం చెప్పను అభిమానం, ప్రేమ, గౌరవం వంటివేవో అంటారు కదా అదేదో నాకూ ఉందో, కలిగిందో అనుకుంటాను అంది డాగీ. మనుషుల్లా తీపికబుర్లు చెప్పడం వచ్చిందే నీకు. నాకు తెల్సు తొమ్మిది రోజులు వినాయక మండపం వెనుక పేపర్ ప్లేట్లల్లో మిగిలిందంతా కడుపు నిండా మెక్కి వచ్చేవాడివి కదా! ఇప్పుడు ఇంక టైంకి ఫుడ్డు దొరకదన్నదే కదా నీ బాధాతప్త హృదయక్షోభ అన్నది డాంకీ. నిజమే సుమీ. నీ దగ్గర అబద్ధం గోడ కట్టినా, హైడ్రా బుల్డోజర్ దెబ్బకు కూలిపోతున్న బిల్డింగులా కుప్పకూలుతోంది. ఇన్నాళ్లూ తోక ఊపుకుంటూ వెళ్లాను. ఇక రేపట్నించి వీధులన్నీ సర్వే చేయాల్సిందే. అసలు ఈ వినాయకుడ్ని నిమజ్జనం చేయడం అవసరమా చెప్పు అంది దిగులుగా డాగీ.

తొమ్మిది రోజులు హంగూ ఆర్భాటంగా ఓ వెలుగు వెలిగిన

రంగస్థలం

వినాయకుణ్ణే కాదు ఐదు సంవత్సరాలు కిందా మీదా తెలీకుండా, నోటికి వచ్చింది వాగుతూ, చేతికి వచ్చింది చేస్తూ, చేతివాటం చూపుతూ విర్రవీగే నాయకుల్ని కూడా ఎన్నికల్లో నిమజ్జనం చేస్తారు కదా అంది డాంకీ. నిజమే నాయకుడని, తిరుగులేని మహానాయకుడని, బాపని, తోపని పాలాభిషేకాలు, భజనలూ, పాదాభివందనాలూ చేసిన ప్రజలే ఆ నాయకుడ్ని ఆకాశం నించి నేలకు లాగుతారు. అడ్డదిడ్డంగా ప్రవర్తిస్తే అభిమానాన్ని తుంగలో తొక్కి చూపుడు వేలు మీద ఇండెలిబుల్ ఇంకు చుక్కతో చుక్కలు చూపిస్తారు అని డాగీ అంటుంటే అరుగు ఎక్కాడు అబ్బాయి.

ఏంటి బ్రో ఈ మధ్య కనిపించడం మానేశావు. కొంపదీసి ఉద్యోగం దొరికేసిందా లేక నిరుద్యోగ భృతి అందేసిందా? అంది డాంకీ. ఆ రెండూ అందరు నాయకులకూ ఎన్నికలప్పుడు వాడుకోటానికి పనికి వచ్చే ఊకదంపుడుకు ఊతమిస్తాయి. ఆ సమస్యలూ, రావణకాష్టమూ సదా ఎల్లకాలమై ఉండి తీరాల్సిందే, మండి తీరాల్సిందే. అదేం లేదు. ఇదిగో ఇది చూశారా అని జేబులోంచి ఓ వస్తువు తీసి చూపించాడు అబ్బాయి. ఇదా ఇది సెల్‌ఫోన్ కదా! న్యూస్ పేపర్లో ఎన్నిసార్లు నమిలానో దీన్ని అంది డాంకీ. కరెక్టుగా చెప్పావు. 'యూట్యూబర్' నయ్యి ఉద్యోగం లేకుండానే సద్యోగంతో డబ్బు సంపాదిద్దామని అనుకుంటున్నాను. యూట్యూబర్ అంటే ఏమిటి బ్రో అంది డాగీ. లేనిది ఉన్నట్టు ఉన్నది లేనట్టు చూపించడమన్న మాట. చెప్పేది ఒకటి చూపేది ఇంకొకటి అని కూడా అన్నమాట. అంతేకాదు జనం చెవుల్లో పూలు పెట్టడం అన్నమాట. ఇంట్లో, వంటింట్లో, వాకిట్లో, నూతిలో, గోతిలో, చెరువులో, చేనులో, చెత్తకుండీల్లో, రైలుపట్టాల్లో రీళ్లు తీసీ, రీళ్లకు రీళ్లు లాగి అసత్యాలు, అభూతకల్పనలు, బూతులు ప్రచారంచేసి జనం మెదళ్లలో 'డెవిల్స్ వర్క్ షాపు' ఓపెన్ చెయ్యడం, అనేక అపకృత్యాలు, దుష్కృత్యాలు చూపించే విచ్చలవిడితనంతో 'లైకు'లు సాధించేవాడన్నమాట అంది గుక్కతిప్పుకోకుండా డాంకీ. జనాన్ని రెచ్చగొట్టే వార్తలు వండిపెట్టడం అసలు వార్తల్ని హరించడం వంటివేమీ చేయనులే. నువ్వు చెప్పిన అకృత్యాల జాబితాలో వేవీ చేయకుండా ఉంటానులే. అన్నింటి కంటే ముందు మన స్టోరీనే చేద్దాం. ఒక డాగీ ఒక డాంకీ ఓ తెలుగబ్బాయి స్టోరీని వైరల్ చేద్దాం. ముందుకు రండి ముగ్గురం కలిసి ఓ సెల్ఫీ దిగుదాం అన్నాడు అబ్బాయి. వద్దు బ్రో మనుషుల భాష తెల్సిన డాగీ, డాంకీ ఉన్నాయని తెలిస్తే మనుషులు మమ్మల్ని బతకనీయరు. మా మానాన మమ్మల్ని ప్రశాంతంగా ఇలా ఉండిపోనీ అంది డాగీ. మీ భయానికి అర్థం ఉందిలే. స్టోరీ సంగతి తర్వాత చూద్దాం కానీ ఓ 'సెల్ఫీ' అయితే దిగుదాం. మీ మీద నాకున్న అభిమానానికి, నా మీద మీకున్న అభిమానానికి గుర్తుగా ఉండిపోతుంది అన్నాడు అబ్బాయి.

ఈ అభిమానం అనే మాట మనుషులకే బాగా వర్తిస్తుంది. సినీ తారలంటే అభిమానం, క్రీడాకారులంటే అభిమానం, నాయకులంటే అభిమానం అసలు ఈ అభిమానం అంటే వేలంవెర్రి అనేగా, వెర్రి వేయి విధాలనేగా, పైత్యం ప్రకోపించడమనేగా. మామూలు మనుషుల్ని మునగ చెట్టెక్కించటం, దేవుడ్ని చేసెయ్యడమేగా అంది డాంకీ. అవునవును వెర్రి ముదిరింది, తలకు రోకలి చుట్టండనే మాట కూడా ఉన్నది. ఈ మధ్య డ్యూటీలో ఉన్న ఓ మహిళా పోలీసు ఓ నాయకుడు కాని నాయకుడితో 'సెల్ఫీ' దిగిందట కదా. తన పని తాను చూసుకోకుండా ఈ వెర్రి ప్రదర్శన అవసరమా అంది డాగీ. దీనికంటే మంచి ముచ్చట మరోటి చెప్పనా? ఓ యువకుడు అడ్డొచ్చిన జనం తలలమీదికి పాకి, కారు మీదకి ఎగబాకి ఓనేత చెంపని ఎంగిలి చేశాడంట అంది డాంకీ. 'జూ' కి వెళ్లి సింహం నోట్లో చేయిపెట్టి సెల్ఫీ తీసుకుని వైరల్ అయిపో భాయీ మా జోలికి మాత్రం రాకు అంది డాగీ. అభిమానం అంటే వెర్రి. వెర్రి అంటే అభిమానం అని అర్థం అయింది. అది మనుషులకే పరిమితం మాకు మాత్రం అనవసరం అంది డాంకీ.

రెండు పార్టీల వ్యవస్థ బద్దలు కానుందా?

డివివియస్ వర్మ

ఒక పార్టీ తర్వాత మరొక పార్టీ అధికారాన్ని మార్చుకునే రెండు పార్టీల వ్యవస్థ ప్రజాస్వామ్యంలో గొప్ప ముందడుగుగా భావించే వారున్నారు. రాజకీయ సుస్థిరతకు ఇది తప్పనిసరి అని అవసరంగా వాదించే వారున్నారు. తామర తంపరగా పార్టీలు పుట్టుకు రావడాన్ని ఇది నిరోధిస్తుందని తలపోసేవారున్నారు. వాస్తవానికి రెండు పార్టీల వ్యవస్థ ఒక గానుగ ఎద్దు ప్రజాస్వామ్యం. ఒక పార్టీ తర్వాత మరో పార్టీ తిరగడం తప్ప ముందుకు సాగే రాజకీయంకాదు. పైగా ఈ పద్ధతి ప్రత్యామ్నాయ రాజకీయాన్ని కోరే పార్టీలకు పుట్టగతులు లేకుండా చేస్తుంది. రెండు పార్టీల వ్యవస్థ మరో కొత్త రాజకీయశక్తికి చోటు ఇవ్వదు. చిన్న పార్టీలు లేదా ప్రత్యామ్నాయ రాజకీయాన్ని కోరే పార్టీలు రెండు పాలకపక్షాలతో ఏదో ఒక దానితో ఉనికి కోసం జతకట్టాలి లేకపోతే ఆ రెండు పార్టీల మధ్య జరిగే పోటీలో నలిగిపోయి పరాజయం పొందుతాయి. రెండు పార్టీల వ్యవస్థ ప్రత్యామ్నాయ రాజకీయానికి గొడ్డలిపెట్టు మాత్రమే కాదు నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రెండు పార్టీల వ్యవస్థ ప్రారంభమైంది.

2009 వరకు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలే ఒకరి తర్వాత ఒకరు పాలకులవుతూ వచ్చారు. 2014 నాటికి రాజశేఖర రెడ్డికి వారసునిగా జగన్‌మోహన్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీని కబ్జాచేసి వైఎస్‌ఆర్ పార్టీ రూపంలో ముందుకువచ్చారు. అప్పటి నుంచి రాష్ట్రంలో రెండు పార్టీల వ్యవస్థ తెలుగుదేశం-వైసీపీ రూపం తీసుకుంది. పైగా రెండు ప్రాంతీయ పార్టీల మధ్య ఘర్షణగా రూపాంతరం చెందింది. రాష్ట్రంలో తిరిగి కొత్త రూపంలో ఒకరి తర్వాత మరొకరు పాలకులయ్యే రెండు పార్టీల వ్యవస్థే వచ్చింది. ఈ మొత్తం కాలంలో వామపక్షాలు ఏదో ఒక పాలక పక్షంతో ఎన్నికల సర్దుబాటు చేసుకున్నప్పుడు కొన్ని శాసనసభ, పార్లమెంటు స్థానాల్లో విజయాలు పొందాయి. అలా కాకుండా ప్రత్యామ్నాయం కోసం విడిగా పోటీ చేసినప్పుడు అవి ఈ "రెండు పార్టీల వ్యవస్థ" పోటీలో నలిగిపోయి ఫలితాలు సాధించలేక పోయాయి.

2009లో సినీనటుడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని పెట్టి రెండు పార్టీల వ్యవస్థలో మరో కొత్త రాజకీయశక్తిగా ఎన్నికల్లో పోటీకి దిగారు. 18 శాసనసభా స్థానాలు గెల్చుకుని 16 శాతం ఓట్లు సాధించి కొంత ప్రభావాన్ని చూపించారు. అయితే "రెండు పార్టీల వ్యవస్థ" సంఘర్షణ మధ్య చిరంజీవి తన పార్టీని నిలబెట్టుకోలేక ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనంచేసి మూడో రాజకీయశక్తి స్థానం నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న రెండుపార్టీల వ్యవస్థ భవిష్యత్తును పరిశీలించడానికి గత రెండు ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకోవాలి. 2014 ఎన్నికల్లో 102 శాసనసభ స్థానాలను గెల్చుకున్న తెలుగుదేశం పార్టీ 2019లో కేవలం 23 స్థానాలకు పడిపోయింది. అప్పుడు 70 స్థానాలు పొందిన వైసీపీ 2019 ఎన్నికల్లో 151 స్థానాలు గెల్చుకుంది. 2024 ఎన్నికల్లో వైసీపీ బలం 11కి పడిపోయింది. ఈ రెండు ఎన్నికల్లో ప్రజల తీర్పు ఏకపక్షంగా వచ్చింది. ఓడించదలచిన పార్టీలకు ఘోర పరాజయాన్ని చవిచూపించారు.

ప్రస్తుత ఎన్నికలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేసినా అందులో తెలుగుదేశం పార్టీయే ప్రధాన పార్టీ. తెలుగుదేశం పార్టీకి 40ఏళ్ల పైబడ్డ చరిత్ర వుంది. ఓటమి తర్వాత ఓటమిని చవిచూసినా నిలదొక్కుకుని తిరిగి అధికారాన్ని దక్కించుకోగల పార్టీ యంత్రాంగం, వివిధ స్థాయిల నాయకత్వం ఆ పార్టీకి వుంది. వైసీపీకి వివిధస్థాయిల్లో వున్న పార్టీ యంత్రాంగం, నాయకత్వం అలాంటిది కాదు. ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఆ పార్టీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితి దానికి అద్దం పడుతున్నది. అవకాశం దొరికిన కొందరు నాయకులు, కిందిస్థాయి కార్యకర్తలు పార్టీని వీడుతున్నారు. అధికారంలో వున్నప్పుడు అతిగా వీరంగం వేసిన కొందరు అజ్ఞాతవాసం చేస్తున్నారు. మరి కొందరు రాజకీయ సన్యాసం ప్రకటించి తమతమ వ్యాపారాలకు పరిమితం అవుతున్నారు. ఆ పార్టీ అధ్యక్షునికి దన్నుగా తెరముందుకు వస్తున్న వారి సంఖ్య ఇప్పుడు వేళ్ల మీద లెక్కించే స్థాయికి పడిపోయింది. మరో పక్క వైసీపీ అధ్యక్షునిపై తలమీద కత్తిలా కేసుల విచారణ వుండనే వుంది. మొత్తం మీద ఆ పార్టీ "నాయకత్వ సంక్షోభంలో" కూరుకుపోతున్న పరిస్థితి కనిపిస్తున్నది. వైసీపీ తిరిగి పుంజుకునే అవకాశాలు సందేహాస్పదంగా వున్నాయి.

ఈ ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లే వచ్చినా ఆ పార్టీ 40 శాతం ఓట్లను తెచ్చుకుంది. ఇది విస్మరించడానికి వీలుకాని గణనీయమైన సంఖ్య. ఈ ఓటర్లను వైసీపీ నిలబెట్టుకో గలుగుతుందా అన్నదే అసలు సమస్య. అన్ని స్థాయిల్లో నాయకత్వ సంక్షోభం, కిందిస్థాయి నేతల్లో స్తబ్దత వున్నప్పుడు ఆ పార్టీ తన ఓటర్లను నిలుపుకోవడం తేలిక మాత్రం కాదు. వైసీపీ ఓటర్లలో అత్యధికులు దళితులు, ఆదివాసీలు, బహుజనులు, మైనారిటీ తరగతులకు చెందినవారు. ఈ ఓటర్లు తెలుగుదేశం దాని కూటమి పార్టీలకు సంప్రదాయకంగా వ్యతిరేకులు. స్థానికంగా వారికి దన్నుగా వుండే నాయకత్వంలేనప్పుడు వారు నిర్లిప్తతకు లోనౌతారు లేదా మరో దారికోసం ఎదురు చూస్తారు.

ఈ ప్రజా సమూహాలు ఒకనాడు వామపక్షాలకు తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులుగా వున్నవారు. వైసీపీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వామపక్షాల కూటమి లేదా "ఇండియా" కూటమి ఈ ప్రజాసమూహాలను సమీకరించడం వారికి అవసరమైన నాయకత్వాన్ని అందించగలిగితే మరో రాజకీయశక్తి రాష్ట్ర రాజకీయాల్లో ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో పక్క తెలుగుదేశం కూటమి తిరుగులేని మెజారిటీ సాధించినా అది ప్రకటించిన "సూపర్ సిక్స్" వాగ్దానాలను తూ.చ తప్పకుండా నిలబెట్టుకోవడం ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ పరిధిలో అంత తేలికకాదు. ఇప్పటికే అప్పులకుప్పగా వున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో టీడీపీ కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన "అభివృద్ధి - సంక్షేమం" ఆచరణలో ఆశించిన ఫలితాలు ప్రజలకు కనిపించకపోతే పాలనపై అసంతృప్తి కలగడం సహజం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషిస్తే రాష్ట్రంలో రెండు పార్టీల వ్యవస్థలో మరో రాజకీయశక్తి రంగ ప్రవేశానికి అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ ప్రజా సమూహాలు ఒకనాడు వామపక్షాలకు తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులుగా వున్నవారు. వైసీపీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వామపక్షాల కూటమి లేదా "ఇండియా" కూటమి ఈ ప్రజాసమూహాలను సమీకరించడం వారికి అవసరమైన నాయకత్వాన్ని అందించగలిగితే మరో రాజకీయశక్తి రాష్ట్ర రాజకీయాల్లో ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో పక్క తెలుగుదేశం కూటమి తిరుగులేని మెజారిటీ సాధిం చినా అది ప్రకటించిన "సూపర్ సిక్స్" వాగ్దానాలను తూ.చ తప్పకుండా నిలబెట్టుకోవడం ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ పరిధిలో అంత తేలికకాదు. ఇప్పటికే అప్పలకుప్పగా వున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో టీడీపీ కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన "అభివృద్ధి - సంక్షేమం" ఆచరణలో ఆశించిన ఫలితాలు ప్రజలకు కనిపించకపోతే పాలనపై అసంతృప్తి కలగడం సహజం

కేవలం అవకాశాలను చూసి సంతృప్తిపడితే సరిపోదు. అవకాశాలను ఫలితంగా మార్చగల ఆచరణ లేకపోతే ఫలితాలు రావు. ముందుగా నాయకత్వ సంక్షోభంలో చిక్కుకున్న వైసీపీ వెనక వున్న పేదలను సమీకరించడం మీద " ఇండియా" కూటమి పార్టీలు కేంద్రీకరించాలి. ఒకటి రెండు సంవత్సరాలు దీని మీదే పనిచెయ్యాలి. కొత్త ప్రత్యామ్నాయానికి కొత్త బలాన్ని సంపాదించుకోవాలి. ఆ మేరకు రాష్ట్ర రాజకీయంలో వైసీపీ పాత్ర బలహీన పడుతుంది. ఒకటి, రెండు సంవత్సరాలు గడిచేసరికి టీడీపీ కూటమి పాలన బాగోగులు కూడా స్పష్టమవుతాయి. కొత్త రాజకీయ శక్తి మరింత బలపడే కొత్త అవకాశాలు ముందుకు వస్తాయి. రానున్న ఐదేళ్లలో ప్రస్తుత "రెండు పార్టీల వ్యవస్థ"ను బద్దలు కొట్టగల కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం పుట్టుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆచరణలో దీనిని సాకారం చేసుకోవడమే అందరి తక్షణ కర్తవ్యం కావాలి.

దారి దీపం సంపాదకులు
సెల్: 8500678977

విమోచనం కాదు...విలీనమే

సురవరం సుధాకరరెడ్డి

తెలంగాణ విమోచన అనేందుకు బెరుకెందుకని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు. విమోచన అనే పదం విదేశీ వలస నుంచి ఒక దేశం స్వాతంత్ర్యం సంపాదించుకునేందుకు ఉపయోగించే పదం. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో ఒక సంస్థానం మాత్రమే. ఇలాంటి సంస్థానాలు దేశంలో 525 ఉండేవి. ఇలాంటి సంస్థానాలు లేదా ఫ్యూడల్ రాచరిక రాజ్యాలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విభిన్న సందర్భాలలో దేశంలో విలీనం అయ్యాయి. వాటన్నింటిని విమోచన అని మనం అనడంలేదు. ఫ్రెంచ్ సామ్రాజ్యవాదం నుంచి విముక్తి చెందిందని పుదుచ్చేరిని విమోచన అంటాం. అలాగే పోర్చుగీస్ వలసగా ఉన్న గోవాకు విముక్తి ప్రాంతమన్న పదం ఉపయోగిస్తాం. జమ్మూ-కశ్మీర్, మణిపూర్ జునాగఢ్, మణిపూర్‌ని విలీనం అంటున్నాం. సిక్కిం చాలా అలస్యంగా భారత యూనియన్‌లో చేరింది. దానిని విలీనం అంటున్నాం. హైదరాబాద్ సంస్థానం సాయుధ పోరాటం తర్వాత పోలీసు యాక్షన్ ద్వారా భారత దేశంలో విలీనమైంది. కేంద్ర ప్రభుత్వం బీజేపీ చేతిలో ఉన్నందున కేంద్రం నుంచి ఒక వైపు విలీనం అనిరాస్తూ మరో వైపు విమోచన అనే పదం వినియోగిస్తున్నారు. హైదరాబాద్ సంస్థానానికి సంబంధించి ఆనాటి కేంద్ర ప్రభుత్వం విలీనం అనే పదమే ఉపయోగించింది. దేశంలో అంతర్భాగంగా ఉంటూ స్వతంత్ర రాజ్యాంగ రాజ్యంగా ప్రకటించుకోవడానికి నిజాం ప్రయత్నం చేసినా ఆనాటి యథాతథ ఒప్పందంలో

విదేశాంగ విధానం, సైన్యం చేతిలో ఉంచుకునేందుకు నిజాం తప్పనిసరి పరిస్థితులలో అంగీకరించారు. అలాంటి పరిస్థితుల్లో అది విమోచనం ఎలా అవుతుంది? హైదరాబాద్ నవాబ్ ముస్లిం కనుక విముక్తి జరిగిందని బీజేపీ వారు ప్రచారం చేస్తున్నారు. ఇది మతోన్మాద అహంకారంతో చేస్తున్న వాదన. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం. ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్న బీజేపీ నాయకులలో లా చదివిన వారున్నారు, కేంద్ర మంత్రిగా పనిచేసిన వారు, గవర్నర్‌గా పనిచేసిన వారున్నారు. పదాలకు అర్థం వారికి తెలియదని నేను అనుకోను.

విమోచనం ఎవరి నుంచి ఎవరికి? యావన్మంది ప్రజలు సంస్థాన నిరంకుశం నుంచి భారత్ యూనియన్‌లో విలీనమయ్యారు. రాచరికం నుంచి విమోచన అయితే గ్వాలియర్ సంస్థానం విమోచన చెందిందా? విలీనమైందా?

భారతదేశం బ్రిటీష్ వలసగా ఉంది. స్వాతంత్ర్యం పొందడానికి మనం విముక్తి అనే పదం ఉపయోగిస్తాం. బీజేపీ నేతలు కావాలనే హైదరాబాద్ సంస్థానం రాచరికానికి వ్యతిరేకంగా ప్రధాన పోరాటం చేసిన కమ్యూనిస్టుల సాయుధ పోరాటం గురించి ఒక్క మాట కూడా మాట్లాడడంలేదు, 4500 మంది కమ్యూనిస్టుల బలిదానం గురించి మాటమాత్రంగా కూడా పేర్కొనకపోవడం యాదృచ్ఛికం కాదు. వారు ప్రస్తావించే ఈ అంశాలపైనా, ఇతర విషయాలపైన వారి పార్టీ అంగీకారం ఉందో లేదో తెలియదు. వ్యక్తిగత అభిప్రాయం కూడా కావచ్చు. ఏమైనా హైదరాబాద్ సంస్థానం 1948లో భారతదేశంలో విలీనమైంది తప్ప విమోచన కాదని కేంద్రం ప్రకటించింది. కనుక ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని చేస్తున్న వాదన అసంబద్ధం, ఇది ఎలా రాజ్యాంగ విరుద్ధమో బీజేపీ నేతలు వివరించాలి.

– సీపీఐ మాజీ ప్రధానకార్యదర్శి

జమిలి ఎన్నికలు అసాధ్యం: చిదంబరం

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికల పచారంపై కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం స్పందించారు. రాజ్యాంగం ప్రకారం దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమని చిదంబరం స్పష్టంచేశారు. అలా చేయాలనుకుంటే రాజ్యాంగానికి కనీసం ఐదు సవరణలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణలను ఉభయ సభల్లో ప్రవేశపెట్టేందుకు ఎన్డీయే సర్కారు వద్ద తగిన సంఖ్యాబలం లేదని తెలిపారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' విధానాన్ని ఇండియా ఐక్యసంఘటన పూర్తిగా వ్యతిరేకిస్తుందని తేల్చిచెప్పారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని కాంగ్రెస్ భావిస్తోందని ఇటీవల ప్రధాని మోదీ అన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ...తాము ఎన్నో ఏళ్లుగా రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నామన్నారు. అలాంటప్పుడు వాటిని రద్దు చేయాలని ఎందుకు కోరుకుంటామని ప్రశ్నించారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి తొలగించాలని తాము డిమాండ్ చేస్తున్నామని, జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలన్నది తమ విధానామని చిదంబరం చెప్పారు. అక్టోబర్ 5న జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తుందా అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ 'ఎన్నికలు జరిగిన అనంతరం ఎమ్మెల్యేల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం ఎవరనేది అధిష్ఠానం ప్రకటిస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చిదంబరం ప్రజలను అభ్యర్థించారు. హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తామని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉగ్రవాదాన్ని పాతిపెడతాం అమిత్ షా

శ్రీనగర్: ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మోదీ పాలనలో ఉగ్రవాదం పునరుద్ధరణకు ఎవరూ సాహసించలేరన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కిశ్త్వార్‌లో సోమవారం నిర్వహించిన సభలో అమిత్‌షా మాట్లాడుతూ నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కలిసి ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేవన్నారు. మళ్లీ కనిపించనంత స్థాయిలో ఉగ్రవాదాన్ని రూపుమాపుతామని చెప్పారు. ఉగ్రవాదుల విడుదల గురించి నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ తమ మేనిఫెస్టోల్లో హామీ ఇచ్చాయని, ఇది ఎంతమాత్రం ప్రయోజనకరం కాదని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదాన్ని ఏ శక్తీ పునరుద్ధరించలేదని అమిత్ షా చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో రెండు శక్తుల మధ్య పోటీ ఉందని, ఒకవైపు ఎన్సీ, పీడీపీ మరోవైపు బీజేపీ ఉన్నాయన్నారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఆర్టికల్ 370 పునరుద్ధరిస్తామని ఎన్సీ-కాంగ్రెస్ చెబుతున్నాయని, కానీ, వారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేరన్నారు. ఆర్టికల్ 370 చరిత్రలో కలిసిపోయిందని, అది తిరిగి రాదని కేంద్రమంత్రి అన్నారు.

జనగణన చేపట్టకపోవడం మోదీ సర్కార్ బలహీనత

ప్రియాంక్ ఖర్గే

బెంగళూర్: జనగణన నిర్వహించకపోవడం మోదీ ప్రభుత్వ బలహీనతను తెలియజేస్తోందని కర్నాటక మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే అన్నారు. గణాంకాలు లేకపోవడంతో మోదీ ప్రభుత్వం విధాన వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని దుయ్యబట్టారు. ప్రియాంక్ ఖర్గే సోమవారం బెంగళూర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్డీయే అంటే నో డేటా అవైలబుల్ అని ఆయన అభివర్ణించారు. మరోవైపు రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత రవ్‌నీత్ బిట్టూ చేసిన వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. బీజేపీ నేతలు చిత్తశుద్ధి కోల్పోయారని తాను భావిస్తున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వేర్పాటువాదులు, ఉగ్రవాదులే వత్తాసు పలుకుతారని బిట్టూ తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. తనకు తెలిసినంత వరకూ ఉగ్రవాదులు పార్లమెంట్ సభ్యులు కాలేరని అన్నారు. రాహుల్‌ను విమర్శించాలనుకునే వీరంతా తామే చెడుగా చిత్రీకరింపబడతారని వ్యాఖ్యానించారు. కాగా, అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ భారతీయుడు కాదని, ఆయన తన జీవితకాలంలో అధిక సమయం విదేశాల్లోనే గడుపుతారని అన్నారు. విదేశీ పర్యటనల్లో భారత్ గురించి తప్పుగా మాట్లాడతారని, ఆయనకు దేశం పట్ల ప్రేమ లేదని దుయ్యబట్టారు. వేర్పాటువాదులు, బాంబులు, తుపాకీలు తయారుచేసేవారు, మోస్ట్ వాంటెడ్ పీపుల్ వంటి వారు మాత్రమే రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ప్రశంసిస్తారని ఎద్దేవా చేశారు.

కేజ్రీవాల్ వారసుడెవరు?

రేసులో అతిశి, భరద్వాజ్, రాఘవ్ చద్దా, సంజయ్‌సింగ్

న్యూఢిల్లీ: రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటన చేయడంతో తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై ఢిల్లీలో పుకార్లు షికారు చేస్తున్నాయి. కేజ్రీవాల్ జైల్లో ఉన్నంతకాలం ప్రభుత్వాన్ని, పార్టీని చక్కబెట్టిన మహిళా మంత్రి, పార్టీ సీనియకురాలు అతిశిని ఏకగ్రీవంగా ఎంపిక చేస్తారా లేక ఇంకెవరికైనా బాధ్యతలు అప్పగిస్తారా అనే ప్రశ్న రాజకీయవర్గాల్లో చక్కర్లు కొడుతోంది. అతిశితో పాటు కొంతమంది పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సీనియర్ మంత్రి అతిశి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. విద్యాశాఖతో పాటు ఇతర కీలక శాఖలను ఆమె నిర్వహిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆమె చదువుకున్నారు. ఢిల్లీలో పాఠశాలల్లో విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి ఆప్ ప్రభుత్వం చేసిన కృషిలో ఆమె కీలకంగా వ్యవహరించారు. కల్కాజీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆమె కొనసాగుతున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీశ్ సిసోడియా అరెస్ట్ అయ్యాక ఆమె మంత్రి అయ్యారు. సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా జైలులో ఉన్నప్పుడు ఆమె పార్టీని నడిపించారు. ఆగస్టు 15న ఢిల్లీ ప్రభుత్వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు అతిశిని కేజ్రీవాల్ ఎంచుకున్నారు. మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్ కూడా ఢిల్లీ సీఎం రేసులో ఉన్నారు. గ్రేటర్ కైలాశ్ నుంచి ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.ప్రభుత్వంలో విజిలెన్స్, హెల్త్ వంటి కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. లిక్కర్ పాలసీ కేసులో సిసోడియా అరెస్టయిన తర్వాత ఆయన కూడా మంచి పేరు పొందారు. గతంలో భరద్వాజ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేశారు. అగ్రనేతలు జైలులో ఉన్నప్పుడు పార్టీని చక్కబెట్టిన కీలక నేతల్లో ఆయన కూడా ఉన్నారు. ఇక ఆప్ జాతీయ కార్యవర్గ, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్న రాఘవ్ చద్దా పేరు కూడా సీఎం రేసులో వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. పార్టీ కీలక నేతల్లో ఒకరిగా ఆయనకు గుర్తింపు ఉంది. కెరీర్ పరంగా గతంలో ఆయన చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేశారు. ఆప్ ప్రారంభమైన నాటి నుంచి ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. గతంలో రాజేందర్ నగర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. పంజాబ్ ఎన్నికల్లో ఆప్ విజయంలో ఆయన కీలక పాత్ర పోషించారు. పార్లమెంట్‌లో కీలక సమస్యలపై గళం విప్పుతున్నారు.

పార్టీ సీనియర్ నాయకుడైన కైలాశ్ గెహ్లోత్ పేరు కూడా జాబితాలో వినిపిస్తోంది. వృత్తిరీత్యా ఆయన న్యాయవాది. రవాణా, ఆర్థిక, గృహ వ్యవహారాలు వంటి కీలకమైన శాఖల మంత్రిగా పనిచేస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉంది. అలాగే, ఢిల్లీ సీఎం పీఠం రేసులో ఆప్ వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్న సంజయ్ సింగ్ పేరు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. 2018 నుంచి ఆయన రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. పార్లమెంట్‌లో అనేకమార్లు ఆకట్టుకునేలా ప్రసంగాలు చేశారు. ఆప్ ప్రముఖ వ్యక్తుల్లో ఒకరిగా ఉన్నారు. పార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా, జాతీయ కార్యవర్గ, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

బీజేపీ ఓటమే లక్ష్యం: ఖర్గే

న్యూఢిల్లీ: ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ కేంద్రం ఇంధన దోపిడీకి పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం విమర్శించారు. ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాల ప్రజలు మోదీ ప్రేరేపిత ధరల పెరుగుదలను తిరస్కరించడం ద్వారా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ముడి చమురు ధరలు 32.5 శాతం తగ్గాయని, అయినప్పటికీ బీజేపీ ఇంధన దోపిడీ కొనసాగుతోందని ఖర్గే అన్నారు. 'ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల ప్రజలు బీజేపీని ఓడించాలి. మోదీ ప్రేరేపిత ధరల పెరుగుదలను తిరస్కరించాలి!' అని ఖర్గే 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'మే 16, 2014న (ఢిల్లీ) ముడి చమురు బ్యారెల్ ధర 107.49 డాలర్లు. పెట్రోల్ రూ.71.51. డీజిల్ రూ.57.28. సెప్టెంబరు 16, 2024న ముడి చమురు బ్యారెల్ ధర 72.48 డాలర్లు, పెట్రోల్ రూ.94.72, డీజిల్ రూ.87.62' అని కాంగ్రెస్ అధ్యక్షుడు వివరించారు. ప్రస్తుత ముడిచమురు ధరల ప్రకారం పెట్రోలు ధర రూ.48.27, డీజిల్ ధర రూ.69.00 అని అన్నారు. '10 ఏళ్ల 100 రోజుల్లో మోదీ ప్రభుత్వం ఇంధనంపై పన్ను విధించి ప్రజల నుంచి 35 లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు!' అని తెలిపారు.

నిఫా వైరస్. .. మలప్పురంలో మాస్కులు తప్పనిసరి

తిరువనంతపురం: కేరళలో నిఫా వైరస్ విజృంభిస్తోంది. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మలప్పురం జిల్లాలో మళ్లీ మాస్కులను తప్పనిసరి చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకూ ఈ నిబంధన కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిఫా వైరస్‌తో అక్కడ ఓ వ్యక్తి (23) గత సోమవారం చనిపోయారు. పెరింతల్‌మన్నలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పూణెలోని వైరాలజీకి నమూనాలు పంపగా నిఫా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి వెల్లడించారు. మృతుడితో సన్నిహితంగా మెలిగిన వారి ఆచూకీ తెలుసుకునేందుకు వైద్యారోగ్య, రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

దేశవ్యాప్తంగా సోలార్ పవర్ ప్లాంట్లు

గుజరాత్ సదస్సులో ప్రధాని మోదీ

గాంధీనగర్: ప్రజలు ఎంతో నమ్మకంతో తమకు మూడోసారి అధికారం కట్టబెట్టారని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. ప్రపంచంలోని ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను మూడోస్థానంలో నిలబెట్టే సంకల్పంతో 140 కోట్ల మంది భారతీయులు పని చేస్తున్నారని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గ్లోబల్ రెన్యువబుల్ ఇన్వెస్టర్స్ సదస్సును ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించారు. గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక వంటి రాష్ట్రాల భాగసామ్యంతో సదస్సు జరుగుతోంది. 'దేశ మిషన్-విజన్‌లో ఈ కార్యక్రమం ఒక భాగం. 2047కు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేయాలనే మా కార్యాచరణలో ఇదీ ఒకటి. మా ప్రభుత్వం ఏర్పడిన ఈ వంద రోజుల్లో తీసుకున్న నిర్ణయాల్లో మా ప్రణాళికకు సంబంధించిన ట్రైలర్ కనిపిస్తుంది. దేశ ప్రగతికి సంబంధించి ప్రతీ రంగానికి చెందిన అంశాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించాం' అని మోదీ తెలిపారు. 'దేశంలో మొట్టమొదటి సోలార్ పవర్ పాలసీ రూపొందించిన రాష్ట్రం గుజరాత్. తర్వాత దీనిని జాతీయస్థాయిలో తీసుకెళ్లాం. కొన్ని రాష్ట్రాల్లో సోలార్ పవర్ గురించి చర్చలు కూడా జరగని సమయంలో ఈ రాష్ట్రం సోలార్ ప్లాంట్లు ప్రారంభించింది. రాముడి జన్మస్థానం అయోధ్య నగరాన్ని మోడల్ సోలార్ సిటీగా మార్చేలా అడుగులు పడుతున్నాయి. మేం దేశవ్యాప్తంగా మరో 17 నగరాలను గుర్తించాం. అవి కూడా సోలార్ సిటీలుగా అభివృద్ధి చెందుతాయి. వాతావరణ మార్పు అనే అంశం ప్రచారంలో లేకముందే... దీనిపై మహాత్మాగాంధీ ప్రపంచాన్ని అప్రమత్తం చేశారు. మన అవసరాలు తీర్చడానికి తగినన్ని వనరులను భూమి మనకు అందిస్తుంది. కానీ మన దురాశను తీర్చడానికి కాదని మహాత్ముడు అనేవారు. గ్రీన్ ఫ్యూచర్, నెట్ జీరో అనేవి కేవలం పదాలు కాదు. అవి భారత్ నిబద్ధత. ఒక అభివృద్ధి చెందుతున్న దేశంగా మేం వాటిని విస్మరించొచ్చు. అయితే మానవాళి భవిష్యత్తు గురించి చింతించే మనుషులం మనం.

నేటి భారతం రాబోయే వెయ్యి సంవత్సరాలకు పునాది వేస్తోంది. మా లక్ష్యం అగ్రస్థానానికి వెళ్లడం మాత్రమే కాదు. అక్కడ కొనసాగడం కూడా' అని పునరుత్పాదక ఇంధన వనరుల ఆవశ్యకత గురించి మోదీ వివరించారు. అంతకుముందు సూర్యఘర్ లబ్ధిదారులతో మోదీ ముచ్చటించారు. 'పీఎం సూర్యఘర్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఆ పథకం ద్వారా ప్రతి ఇల్లు విద్యుదుత్పత్తి చేయాలి. దాంతో ప్రతి ఇంట్లో ఏటా రూ.25 వేలు ఆదా చేయవచ్చు. కాలుష్యాన్ని తగ్గించొచ్చు' అని అన్నారు. గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు.

రాహుల్ నాలుక తెగకోస్తే రూ.11 లక్షలు

శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్

ముంబై: రిజర్వేషన్ల వ్యవస్థను రద్దు చేయడంపై చేసిన వ్యాఖ్యలకుగాను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాలుక కోస్తే రూ.11 లక్షలు ఇస్తానని శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద ప్రకటన చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తాను సమర్థించబోనని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాన్‌కులే అన్నారు. రాష్ట్రంలో శివసేన నేతృత్వంలోని ప్రభుత్వంలో బీజేపీ భాగంగా ఉంది. 'రాహుల్ గాంధీ విదేశాల్లో ఉన్నప్పుడు భారతదేశంలో రిజర్వేషన్ విధానాన్ని ముగించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇది కాంగ్రెస్ అసలు ముఖాన్ని బట్టబయలు చేసింది' అని గైక్వాడ్ ఈ వివాదాస్పద ప్రకటన చేయడానికి ముందు విలేకరులతో అన్నారు. 'ఇటీవల అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ రిజర్వేషన్లను రద్దు చేయడం గురించి మాట్లాడారు. ఇది రిజర్వేషన్లను స్వాభావికంగా వ్యతిరేకించే మనస్తత్వాన్ని తెలియజేస్తోంది. రాహుల్ గాంధీ నాలుకను కత్తిరించే ఎవరికైనా నేను రూ.లక్ష బహుమతి ఇస్తాను' అని గైక్వాడ్ అన్నారు. ఎన్నికల్లో డాక్టర్ బాబాసాహెబ్‌ను కాంగ్రెస్ ఓడించిందని చెప్పారు. గాంధీ వ్యాఖ్యలు ప్రజలకు చేసిన అతి పెద్ద ద్రోహమని, మరాఠాలు, ధన్‌గర్లు, ఓబీసీలు వంటి వర్గాలు రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నాయని, అయితే అంతకంటే ముందే దాని ప్రయోజనాలను అంతం చేయడం గురించి రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. 'రాహుల్ గాంధీ రాజ్యాంగ పుస్తకాన్ని చూపించి బీజేపీ దానిని మారుస్తుందని బూటకపు కథనాన్ని ప్రచారం చేసేవారు. అయితే దేశాన్ని 400 ఏళ్ల వెనక్కి తీసుకువెళ్లాలని యోచిస్తున్నదే కాంగ్రెస్' అని ఆయన తెలిపారు. అయితే గైక్వాడ్ వ్యాఖ్యలకు, బీజేపీకి సంబంధం లేదని బవాన్‌కులే అన్నారు. 'గైక్వాడ్ వ్యాఖ్యలను నేను సమర్థించను లేదా ఆమోదించను. అయితే మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రిజర్వేషన్లను వ్యతిరేకించారని, ఇది ప్రగతిని ప్రభావితం చేస్తుందని మేము మర్చిపోలేము. రిజర్వేషన్లు ఇవ్వడం అంటే మూర్ఖులకు మద్దతు ఇవ్వడం అని రాజీవ్ గాంధీ అన్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ రిజర్వేషన్లను అంతం చేస్తానని చెప్పారు' అని బీజేపీ నాయకుడు అన్నారు. నెహ్రూ, రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అవగాహన కల్పిస్తామని, మరాఠా కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే కూడా ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర అధికార ప్రతినిధి అతుల్ లోంధే మాట్లాడుతూ 'సంజయ్ గైక్వాడ్‌కు సమాజంలో, రాజకీయాల్లో ఉండే అర్హత లేదు. మహారాష్ట్ర హోం మంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ గైక్వాడ్‌పై నేరపూరిత నరహత్య ఆరోపణలను ప్రయోగిస్తారో లేదో చూడాలి' అని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ భాయ్ జగ్తాప్ మాట్లాడుతూ ఇలాంటి వ్యక్తుల వ్యాఖ్యలను ఖండిస్తున్నానని... ఇలాంటి వారు రాష్ట్ర రాజకీయాలను చెడగొట్టారని అన్నారు. విదర్భ ప్రాంతంలోని బుల్దానా అసెంబ్లీ స్థానానికి చెందిన ఎమ్మెల్యే గైక్వాడ్‌కు వివాదాలు కొత్తేమీ కాదు. గత నెలలో శివసేన ఎమ్మెల్యే కారును ఓ పోలీసు కడిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వాహనం లోపల వాంతులు చేసుకోవడంతో పోలీసులు స్వచ్ఛందంగా దానిని శుభ్రం చేశారని గైక్వాడ్ తర్వాత వివరించారు. ఫిబ్రవరిలో గైక్వాడ్ తాను 1987లో పులిని వేటాడానని, దాని పంటిని మెడలో వేసుకున్నానని పేర్కొన్నాడు. వెంటనే, రాష్ట్ర అటవీ శాఖ పులి దంతాన్ని ఫోరెన్సిక్ గుర్తింపు కోసం పంపింది. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద గైక్వాడ్‌పై అభియోగాలు మోపింది.

ఉద్యోగుల నిరసనతో వెనక్కి తగ్గిన సెబీ

న్యూఢిల్లీ: మార్కెట్ నియంత్రణ సెబీ సెప్టెంబర్ 4న విడుదల చేసిన ప్రకటనను వెనక్కి తీసుకుంది. పని విధానంపై కొందరు ఉద్యోగులు గళమెత్తగా... వారిపై బయటి వ్యక్తుల ప్రోద్బలం ఉందంటూ సెబీ ఓ పత్రికా ప్రకటన వెలువరించింది. దీనిపై ఉద్యోగులు నిరసన వ్యక్తంచేయడంతో వెనక్కి తగ్గింది. ఇకపై ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను అంతర్గతంగానే పరిష్కరించుకుంటామని, ఆ ప్రకటనను ఉపసంహరించుకుంటున్నట్లు తాజాగా మరో ప్రకటన విడుదల చేసింది. ఇటీవల ఉద్యోగ ప్రతినిధులతో సుహృద్భావ వాతావరణంలో సమావేశం జరిగిందని సెబీ పేర్కొంది. ఇకపై సంస్థకు సంబంధించిన అంతర్గత వ్యవహారాలు నిర్దిష్ట సమయంలో అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని నిర్ణయానికొచ్చినట్లు తెలిపింది. భారత సెక్యూరిటీ మార్కెట్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దిన ఘనత ఉద్యోగులకు దక్కుతుందని కొనియాడింది. ఉద్యోగుల సమస్యలపై అంతర్గతంగా పరిష్కరించుకునేందుకు ఓ విధానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్‌పై వివాదాలు చుట్టుముట్టిన వేళ ఉద్యోగుల లేఖ ఒకటి బయటికొచ్చిన సంగతి తెలిసిందే. సెబీ ఛైర్‌పర్సన్‌గా మాధవి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంస్థ పనివిధానం పూర్తిగా నాశనమైందని ఆరోపిస్తూ కేంద్ర ఆర్థికశాఖకు కొందరు ఉద్యోగులు ఆగస్టులో లేఖ రాశారు. దీనికి సంబంధించిన వార్తలు మీడియాలో రావడంతో సెబీ సెప్టెంబర్ 4న పత్రికా ప్రకటన జారీ చేసింది.

బయటి వ్యక్తుల ప్రోద్బలం ఉందంటూ ఆరోపణలను ఖండించింది. దీనిపై భగ్గుమన్న ఉద్యోగులు మరుసటి రోజు ఉదయం సెబీ కార్యాలయం ముందు శాంతియుతంగా నిరసనకు దిగారు. ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సెబీ నుంచి తాజా ప్రకటన వెలువడింది.

వ్యవస్థలన్నీ సమష్టిగా పని చేయాలి

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్



న్యూఢిల్లీ: దేశంలోని అన్ని వ్యవస్థలు సమష్టిగా పనిచేయాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. సీబీఐ 'పంజరంలో ఉన్న చిలుక' అనే భావనను తొలగించాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సంస్థలు కఠిన పరిస్థితుల్లో పని చేస్తాయని, పరిశీలనలు వాటిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. న్యాయవాదిగా సుదీర్ఘ అనుభవం కలిగి ఉన్న ఉపరాష్ట్రపతి... ముంబైలోని ఎల్ఫిన్‌స్టోన్ టెక్నికల్ హైస్కూల్, జూనియర్ కాలేజీలో సంవిధాన్ మందిర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలోని న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలది ఒకటే ఉద్దేశం. రాజ్యాంగం ప్రాథమిక స్ఫూర్తిని విజయవంతం చేయడం, సామాన్య ప్రజలకు సంబంధించి అన్ని హక్కులకు హామీ ఇవ్వడం, భారతదేశం అభివృద్ధి చెందడానికి సహాయం చేయడం' అని ఉపరాష్ట్రపతి తెలిపారు. 'ప్రజాస్వామ్య విలువలు, మరింత రాజ్యాంగ ఆదర్శాలను పెంపొందించడానికి వారు ఐక్యంగా పని చేయాలి. కొన్ని పరిమితుల గురించి స్పృహలో ఉన్నప్పుడు ఒక సంస్థ బాగా ఉపయోగపడుతుంది. కొన్ని పరిమితులు స్పష్టంగా ఉన్నాయి. అవి సూక్ష్మంగా ఉంటాయి. న్యాయవ్యవస్థ, శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థలు... సవాలు, భయంకరమైన వాతావరణంలో దేశానికి బాగా సేవలందించే స్థాపించబడిన సంస్థలకు హాని కలిగించే రాజకీయ తాపజనక చర్చ లేదా కథనాన్ని ప్రేరేపించే పాయింట్లు కాకూడదు' అని ఉపరాష్ట్రపతి అన్నారు. ఢిల్లీలో రద్దు చేసిన మద్యం పాలసీలో అవకతవకలు జరిగాయని ఆరోపించిన కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తన తీర్పులో ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ అరెస్టు అయిన ఆరు నెలల తర్వాత కోర్టు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అరెస్టు చట్టవిరుద్ధమని గుర్తించనప్పటికీ, న్యాయమూర్తి జస్టిస్ భుయాన్ ఒక ప్రత్యేక తీర్పులో సీబీఐ ప్రధాన దర్యాప్తు సంస్థ అని పేర్కొంటూ, సీబీఐ పంజరంలో చిలుక అనే భావనను తొలగించడం అత్యవసరమని వ్యాఖ్యానించారు. న్యాయమూర్తి వ్యాఖ్యలతో ఆమ్ ఆద్మీ పార్టీ... బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్ర స్థాయిలో విమర్శలకు దిగింది.

ఘోష్ మోసపూరిత సమాధానాలు

- హత్యాచారం ఘటన తెలిసీ ఆలస్యంగా... అస్పష్టంగా ఫిర్యాదు
- అంతకుముందే పోలీసు అధికారి, న్యాయవాదితో సంప్రదింపులు
- సాక్ష్యాల పరిరక్షణలో పోలీసుల వైఫల్యం
- ఆర్‌జీ కర్ కేసు విచారణపై సీబీఐ

న్యూఢిల్లీ: ఆర్‌జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ తన పాలిగ్రాఫ్ పరీక్ష, స్వర విశ్లేషణలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు సంబంధించి ముఖ్యమైన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు 'మోసపూరితమైనవని' తేలిందని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కేసును విచారిస్తున్న సీబీఐ... ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఘోష్‌ను సెప్టెంబరు 2న అరెస్టు చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ తరువాత అతనిపై సాక్ష్యాలు తారుమారు చేసిన ఆరోపణలను జోడించింది. విచారణ సమయంలో ఘోష్‌కు స్వర విశ్లేషణ, పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించారు. న్యూఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్) నుంచి వచ్చిన నివేదిక ప్రకారం, ఈ కేసుకు సంబంధించి 'కొన్ని ముఖ్యమైన విషయాలపై అతని సమాధానాలు మోసపూరితమైనవని' గుర్తించినట్లు ఈ కేసును విచారణ చేస్తున్న సీబీఐ అధికారులు తెలిపారు. పాలిగ్రాఫ్ పరీక్ష సమయంలో వెల్లడైన సమాచారం విచారణ సమయంలో సాక్ష్యంగా ఉపయోగించబడకపోవచ్చు. అయితే కోర్టులో ఉపయోగించగల ధ్రువీకరించే సాక్ష్యాలను దర్యాప్తు సంస్థ సేకరించవచ్చని చెప్పారు. అనుమానితులు, సాక్షుల వాంగ్మూలాలలో దోషాలను అంచనా వేయడంలో పాలిగ్రాఫ్ పరీక్ష సహాయపడుతుంది. వారి మానసిక స్పందనలు, హృదయ స్పందన రేటు, శ్వాస విధానం, చెమటలు, రక్తపోటును పర్యవేక్షించడం ద్వారా పరిశోధకులు వారి ప్రతిస్పందనలలో వ్యత్యాసాలు ఉన్నాయో లేదో గుర్తించగలరు. ఆగస్టు 9వ తేదీ ఉదయం 9.58 గంటలకు జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి సంబంధించిన సమాచారం ఘోష్‌కు అందిందని, అయితే అతను వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయలేదని సీబీఐ ఆరోపించింది. బాధితురాలు మధ్యాహ్నం 12.44 గంటలకు చనిపోయినట్లు ప్రకటించినప్పటికీ, అతను తర్వాత దశలో మెడికల్ సూపరింటెండెంట్-వైస్ ప్రిన్సిపాల్ ద్వారా 'అస్పష్టమైన ఫిర్యాదు' చేశాడని వారు తెలిపారు. 'అతను వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ప్రయత్నించలేదు. బదులుగా ఆత్మహత్య అనే కొత్త వాదను మొదలుపెట్టాడు. అయితే ఇది దిగువ భాగంలో దుస్తులు తొలగించబడి ఉన్న బాధితురాలి శరీరంపై కనిపించే బాహ్య గాయంవల్ల సాధ్యం కాదు' అని సీబీఐ పేర్కొంది. ఘోష్ ఉదయం 10.03 గంటలకు తాలా పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ అధికారి (ఓసీ) అభిజిత్ మోండల్‌తో, మధ్యాహ్నం 1.40 గంటలకు ఒక న్యాయవాదితో సంప్రదించారని, రాత్రి 11.30 గంటలకు అసహజ మరణం కేసు నమోదయిందని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ అరెస్టు చేసిన మోండల్‌కు ఆగస్టు 9 ఉదయం 10.03 గంటలకు సంఘటన గురించి సమాచారం అందింది. అయితే వెంటనే నేరం జరిగిన ప్రదేశానికి చేరుకోలేదని సీబీఐ అధికారులు పేర్కొన్నారు. గంట తర్వాత సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జనరల్ డైరీ ఎంట్రీ 542 ప్రకారం, ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలోని జూనియర్ వైద్యురాలి మృతదేహం ఛాతీ ఔషధాలకు చెందిన సెమినార్ గదిలో 'స్పృహ లేని స్థితిలో' పడి ఉందని పేర్కొంది.

అయితే మృతదేహాన్ని పరిశీలించిన వైద్యుడు బాధితురాలి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సాధారణ డైరీ ఎంట్రీ 'ఆస్పత్రి అధికారులు, ఇతర తెలియని వ్యక్తులతో కుట్రతో' ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలను ప్రస్తావిస్తూ రూపొందించారు.

సాక్ష్యాలు తారుమారు చేశారు

ఎఫ్ఐఆర్ నమోదులో, నేరం జరిగిన ప్రదేశాన్ని రక్షించడంలో మోండల్ విఫలమవడం వల్ల 'నేర స్థలంలో లభ్యమైన కీలక సాక్ష్యం దెబ్బతింది' అని అధికారులు తెలిపారు. నేరం జరిగిన ప్రదేశానికి అనధికారికంగా ప్రవేశించిన నిందితుడు సంజయ్ రాయ్, ఇతరులను రక్షించడానికి అతను ప్రయత్నించాడు. అది సాక్ష్యాల తారుమారుకు దారి తీసి ఉండవచ్చు. మృతదేహాన్ని త్వరత్వరగా మార్చురీకి పంపించాలని ఘోష్ కిందిస్థాయి అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు. ఆగస్టు 9 తెల్లవారుజామున షిఫ్ట్ సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వెళ్లిన జూనియర్ వైద్యురాలు ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రి సెమినార్ హాల్‌లో హత్యాచారానికి గురయ్యారు. హాల్‌లో తీవ్రంగా గాయపడిన ఆమె మృతదేహాన్ని అప్పుడు రౌండ్స్‌లో ఉన్న వైద్యుడు గుర్తించాడు. సంఘటన జరిగిన రోజు తెల్లవారుజామున 4.03 గంటలకు సెమినార్ హాల్‌లోకి ప్రవేశించిన సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సంజయ్ రాయ్ అనే పోలీసు వలంటీర్‌ను మరుసటి రోజు అరెస్టు చేశారు. ఆగస్టు 13న కలకత్తా హైకోర్టు కోల్‌కతా పోలీసుల నుంచి దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తూ ఆగస్టు 14న కేసును స్వీకరించింది.

పేదలపై ద్వేషం... కార్పొరేట్లకు దాసోహం

మోదీ 100 రోజుల పాలనపై నారాయణ తీవ్ర విమర్శలు

గువహతి: కేంద్రంలోని మోదీ సర్కారు కార్పొరేట్లకు దాసోహం అన్నరీతిలో వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ధ్వజమెత్తారు. అసోం పర్యటనలో ఉన్న నారాయణ... సోమవారం గువహతిలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మిత్రపక్షాల మద్దతుతో మూడోసారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ... 100 రోజుల పాలనలో ఆసాంతం కార్పొరేట్ సంస్థల కోసమే పనిచేశారని విమర్శించారు. తనకు అనుకూలురైన కార్పొరేట్ సంస్థలకు ఎన్‌పీఏ పేరుతో మోదీ లక్షలాది రూపాయల డబ్బు ఇవ్వజూపుతున్నారని, అణగారిన ప్రజల కోసం చేసిందేమీ లేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, నిత్యావసరాల ధరల పెరుగుదలను నియంత్రించాలని సామాన్యులు ఉద్యమిస్తున్నా మోదీ కంటికి ఇవేమీ కనిపించడం లేదన్నారు. నిజానికి గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని తిరస్కరించారని నారాయణ పేర్కొన్నారు. గతంలో కంటే వారి సీట్లు 240కి తగ్గాయని, ఆయన ప్రభుత్వం టీడీపీ, జేడీయూలపై ఆధారపడి ఉందని చెప్పారు. ఇక అసోంలో హిమంతవిశ్వ శర్మ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నారాయణ తీవ్రంగా విమర్శించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండానే గిరిజనుల కడుపు కొడుతూ అమానవీయరీతిలో పేదల ఇళ్ల తొలగింపునకు పాల్పడుతోందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు కేటాయించిన సునార్పూర్ గిరిజన ప్రాంతంలో సెప్టెంబరు 12న తొలగింపుల సందర్భంగా నిర్వాసిత ప్రజలు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణ కాల్పులకు దారితీసి నలుగురు అమాయక పౌరులు మృతిచెందడంతో పాటు అనేకమంది గాయాలపాలయ్యారు. అదే గిరిజనులకు రిజర్వుచేసిన ఆ ప్రదేశంలో కార్పొరేట్ సంస్థ సిమెంట్ ఫ్యాక్టరీ ఎలా నిర్మిస్తుందని నారాయణ ప్రశ్నించారు. ఇది ఎలా సాధ్యమని అసోం సీఎంను ప్రశ్నిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపకుండా హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాలని హితవు పలికారు. సీఎం హిమంత విశ్వ శర్మ కుటుంబానికి చెందిన ఆస్తులు అసాధారణరీతిలో పెరగడం గురించి ఆయన ప్రస్తావించారు. ఇది చట్టబద్ధమైన ఆదాయమా లేక అక్రమ ఆదాయమా అనేది అసోం ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని, దీనిపై సీఎం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మునిన్ మహంత, రాష్ట్ర కార్యదర్శి కనక్ గొగోయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధీరేన్ కచారి, గోలాఘాట్ జిల్లా కార్యదర్శి హోరెన్ బోరా పాల్గొన్నారు.

ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపాలి

మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ అధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నడపాలని మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక డిమాండ్ చేసింది. విజయవాడ బాలోత్సవ భవన్‌లో సోమవారం ఐక్యవేదిక అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, మహిళా సంఘం నాయకురాలు పి.పద్మ, ఎస్.విష్ణు మాట్లాడారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విడుదల చేశారు. దుర్గాభవాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు నుంచి నూతన మద్యం పాలసీని ప్రకటిస్తున్నట్లు, అందుకోసం ఈనెల 17న మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నట్లు వార్తలు వస్తున్నట్లు నేపథ్యంలో... ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపాలన్నారు. లైసెన్సింగ్ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలు ఇవ్వనున్నట్లు, లైసెన్స్ ఫీజుల ద్వారా రూ.రెండు వేల కోట్లు ప్రభుత్వానికి ఆదాయం రానున్నట్లు ఆ కథనాలు తెలియజేస్తున్నాయని వివరించారు. మద్యం పాలసీని రూపొందించడంలో ప్రభుత్వ లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. రమాదేవి మాట్లాడుతూ... గత ప్రభుత్వం విక్రయించిన మద్యం బ్రాండ్లతో మూడు వేల మంది చనిపోయారని, నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని, కూటమి పార్టీలు, ముఖ్యంగా టీడీపీ ప్రచారం చేసిందని గుర్తుచేశారు. సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ, నాణ్యమైన మద్యం ప్రజల ప్రాణాలు తీయదా... మహిళలపై హింసకు కారణం కాదా... నేరాలు పెరగకుండా నిరోధిస్తుందా అని ప్రశ్నించారు. విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం విక్రయాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ అధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నిర్వహించాలని, అక్రమ అమ్మకాలు నిరోధించేలా కఠిన చర్యలు ఉండాలని, మద్యంతో చనిపోయిన బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని తదితర డిమాండ్లతో ఉన్న కరపత్రాన్ని విడుదల చేశారు.

దిల్లీకి ముందస్తు ఎన్నికలపై ఈసీ వెనకడుగు!

న్యూదిల్లీ: ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా ప్రకటన దిల్లీ రాజకీయాల్లో కీలకంగా మారింది. మహారాష్ట్రతో పాటు దిల్లీలోనూ ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని ఆప్ డిమాండ్ చేస్తున్నది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దిల్లీలో ముందస్తు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, కేజ్రీవాల్ రాజీనామా ప్రకటనతో తదుపరి సీఎం ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. అయితే.. దీనిపై ఆప్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలోనే ముందస్తు ఎన్నికలపై స్పందించిన ఆప్ కీలక వ్యాఖ్యలు చేసింది. తదుపరి సీఎం ఎవరనే ప్రశ్నకు దిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. సీఎం కేజ్రీవాల్ రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందించనున్నారని, అది ఆమోదం పొందిన వెంటనే తదుపరి సీఎం ఎవరనే అంశంపై చర్చిస్తామన్నారు. పార్టీ ఎమ్మెల్యేలంతా కలిసి ఒకరిని ముఖ్యమంత్రిగా నిర్ణయిస్తామన్నారు. ప్రజలకు ఆప్‌పై నమ్మకం ఉందని, వారు తమను మరోసారి స్వాగతిస్తారన్నారు. అభ్యర్థి ఎవరనేది తెలియడానికి కొంత సమయం పడుతుందన్నారు. వారం రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు. బంతి ఇంకా బీజేపీ కోర్టులోనే ఉందని, కేజ్రీవాల్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటే ముందస్తు ఎన్నికలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సౌరభ్ భరద్వాజ్ సవాల్ విసిరారు. కేజ్రీవాల్ పరువు తీసేందుకు బీజేపీ ఎన్నో విధాలుగా ప్రయత్నించిందని, అయినప్పటికీ ఆయన నిజాయతీపై ప్రజలకు నమ్మకం ఉందని పేర్కొన్నారు.

మోదీ సర్కారు పెట్రో దోపిడీ: గెహ్లాత్

జైపూర్: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల విషయంలో కేంద్రంపై కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్ విమర్శలు గుప్పించారు. ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం లేదని మోదీ సర్కారును దుయ్యబట్టారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, చమురు కంపెనీలు కలిసి సామాన్యుడి జేబులు కొల్లగొడుతున్నట్లు కనబడుతోందని ఆరోపిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'గడిచిన ఆరు నెలల కాలంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు 21 శాతం మేర తగ్గాయి. కానీ, పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గించలేదు. చూస్తుంటే... కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థలు కలిసి సామాన్యుడి జేబులు లూటీ చేస్తున్నాయనిపిస్తోంది. తగ్గిన ముడిచమురు ధరల ప్రకారం పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై రూ.8 వరకు తగ్గించవచ్చు' అని గెహ్లాత్ పేర్కొన్నారు. ఇంధన ధరల తగ్గింపు విషయంలో రాజస్థాన్ ప్రజలను బీజేపీ రెట్టింపు మోసం చేసిందని మండిపడ్డారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్రమోదీ ఇక్కడ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే పెట్రోల్, డీజిల్ ధరలను హర్యానా, గుజరాత్‌లతో సమానంగా ఉండేలా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ అది ఇప్పటివరకు జరగలేదన్నారు. ఈ హామీని ఎప్పటికి నెరవేరుస్తారో రాజస్థాన్ ప్రజలు తెలుసుకోవాలనుకొంటున్నారని వ్యాఖ్యానించారు.

18 నుంచి ఎన్‌పీఎస్ వాత్సల్య

న్యూదిల్లీ: తమ పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి పెట్టాలనుకునే వారికోసం బడ్జెట్‌లో ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్యను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సెప్టెంబర్ 18న ప్రారంభించనున్నారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం. పథకం ప్రారంభంతో పాటు విధివిధానాలు తెలియజేయనున్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికల పేరుతో తల్లిదండ్రులు/సంరక్షకులు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా తీసుకోవచ్చు. పిల్లలు మేజర్లు అయ్యాక ఈ ఖాతా సాధారణ ఎన్‌పీఎస్ ఖాతాగా మారుతుందని జులైలో ప్రకటించిన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

వరద బాధితులకు బాసట: రామకృష్ణ

లంక గ్రామాల్లో సీపీఐ బృందం పర్యటన... పశుపోషకులకు దాణా

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు బాధితులకు బాసటగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కే రామకృష్ణ అన్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం కొల్లూరు లంక గ్రామాల్లో సోమవారం... సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్యతో కలిసి రామకృష్ణ పర్యటించారు. కొల్లూరు మండలం ఆవులవారిపాలెం, పెసర్లంక, గాజుల్లంక గ్రామాల్లో వరద ముంపు వల్ల ఏవిధంగా నష్టపోయిందీ బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీఐ అధ్వర్యంలో సేకరించిన విరాళాలతో ఆవులవారిపాలెంలో 60 మంది పశుపోషకులకు దాణా బ్యాగ్‌లు అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో వరద ముంపునకు బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వరద ముంపు దాటికి అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. తొమ్మిది లక్షల ఎకరాల్లో పంటలు పూర్తిగా నీట మునిగి రైతులకు దుఃఖాన్ని మిగిల్చాయన్నారు. బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎంతోమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సాయం అందించడం శుభ పరిణామం అన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతుగా బాధితులకు భరోసాగా నిలిచినట్టు చెప్పారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ జిల్లాలోని వేమూరు, రేపల్లె నియోజకవర్గం పంటలు అధికంగా పండించే ప్రాంతాలని, పంటలు దెబ్బ తినటం విచారకరం అన్నారు. నోరు తెరిచి అడగలేని మూగజీవాలకు దాణా అందించడం గొప్ప విషయం అన్నారు. సీపీఐ కోరిన వెంటనే సాయం అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. గాజుల్లంక వద్ద అమరవీరుడు బాబిరెడ్డి వెంకటేశ్వర్లు స్థూపానికి నివాళులర్పించారు. బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బావిరెడ్డి ప్రభాకర్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు మేకల బిజిలిబాబు ఉన్నారు.

ప్రజాగేయ చరిత్ర వరదపాలు

- 40 వేల కార్యక్రమాలు, క్లిప్పింగ్‌లు దూరం
- ఇంట్లో విలువైన సామగ్రి పోయినా బాధపడలేదు
- ప్రజాగాయకుడు పిచ్చయ్య ఆవేదన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'నా ఇంట్లో విలువైన సామగ్రి పోయినప్పటికీ బాధపడేవాడిని కాదు. నా ప్రజాగేయాల కార్యక్రమాల ఉద్యమ చరిత్ర నోటు పుస్తకం వరద పాలవ్వడం జీర్ణించుకోలేకపోతున్నాను' అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి, ప్రజాగాయకుడు ఆర్.పిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రజా గేయాల వ్యక్తిగత చరిత్రకు చెందిన నోటు పుస్తకం, కార్యక్రమాల క్లిప్పింగ్‌లు వరదపాలు కావడం బాధించిందని వాపోయారు. దీని నుంచి తేరుకోలేకపోతున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారిగా ఆర్.పిచ్చయ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఎన్టీఆర్‌జిల్లా కలెక్టరు ప్రజాగాయకుడిగా ప్రశంసాపత్రాన్ని ఇటీవల అందజేశారు. ప్రస్తుతం విజయవాడ ఒన్‌టౌన్ కేఎల్‌రావు నగర్‌లో పిచ్చయ్య జీవిస్తున్నారు. ఈనెల 1వ తేదీన వచ్చిన బుడమేరు వరదతో తన ప్రజా గేయాల కార్యక్రమాల చరిత్ర నోటు పుస్తకం వరదపాలైంది. ప్రతి సభ, కార్యక్రమాల్లో తాను పాడిన పాటల వివరాలు, ఆయా కార్యక్రమాల సందర్భాన్ని ఒక నోటు పుస్తకంలోను, ప్రచురితమైన వార్తలను మరో నోటు పుస్తకంలో క్లిప్పింగ్‌ల వివరాలు సేకరించుకోవడం పిచ్చయ్యకు ఆనవాయితీ. ఇప్పుడు అలాంటి విలువైన కార్యక్రమాల చరిత్ర నోటు పుస్తకం, క్లిప్పింగ్‌లు బుడమేరు వరదతో తనకు దూరమవ్వడాన్ని జీర్ణించుకోలేక పోతున్నానని పిచ్చయ్య 'విశాలాంధ్ర'కు తెలిపారు.

'నేను 1972 నుంచి పాటలు పాడుతున్నాను. 1974లో ప్రజానాట్యమండలి పునర్నిర్మాణం జరిగింది. ఆ తర్వాత సీపీఐ పెద్దలు, మేం కమ్యూనిస్టు పార్టీ కుటుంబం కావడం వల్ల మా పెద్దలు ఆర్.ఐజాగ్, మా తండ్రి వెంకటేశ్వరరావు సలహా మేరకు కమ్యూనిస్టు పార్టీలో పాటలు పాడుతూ కొనసాగుతున్నాను' అని పిచ్చయ్య చెప్పారు. '1975 నుంచి ప్రజానాట్యమండలి నన్ను చేరదీసి, శిక్షణ ఇచ్చి ప్రోత్సహించి... మంచి గాయకుడిగా, నిర్వాహకుడిగా ఎదగడానికి దోహదపడింది. ఎందరో మహానుభావుల ప్రోత్సాహం, ఆదరణతో ప్రజాగాయకుడిగా కొనసాగుతున్నాను' అని తెలిపారు.

అప్పటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా 10 మందితో కూడిన సీపీఐ, ప్రజాసంఘాల సమావేశం మొదలుకొని... పది లక్షల మంది పాల్గొనే సభలు, అభ్యుదయ వేదికలపై విస్తృతంగా కార్యక్రమాల్ని నిర్వహించానని పిచ్చయ్య గుర్తుచేశారు. వాటితోపాటు ఈ ఏడాది ఆగస్టు 15న (సీపీఐ రాష్ట్ర కార్యాలయం-దాసరిభవన్) చేసిన కార్యక్రమంతో 40 వేల ప్రజాగేయాల కార్యక్రమాలు పూర్తయినట్లు తెలిపారు. ఆ 40 వేలకు సంబంధించి ఏపీ రాష్ట్రంలో ఏఏ జిల్లాలు, పట్టణాల్లో కార్యక్రమాలు చేశామో... వాటికి సంబంధించిన సంక్షిప్త సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఓ నోటు పుస్తకంలో రాసుకున్నానని అన్నారు. దీంతోపాటుగా 40 వేల కార్యక్రమాలు...పత్రికల్లో ముద్రితమైన క్లిప్పింగ్‌లను సేకరించి... భద్రపరిచానని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ ఎక్కువ కాలం పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, మా ఇద్దరి పిల్లలు(అరుణ, చంద్ర) రాసిపెట్టడం, వారిని ఎప్పటికీ మరచిపోలేనని, ఇంత నిబద్ధతతో తయారుచేసుకున్న తన ప్రజాగేయాల కార్యక్రమాల చరిత్రను... బుడమేరు వరద చిదిమేసిందన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వరదలతో తాము ఒకవైపు సామాన్లను హడావుడీగా భద్రం చేసుకునే సమయంలో... అప్పటికే మోకాలులోతు నీళ్లు పైకి రావడం ద్వారా బాగా హైరానా పడుతున్నప్పుడు... ఇంటి లోపలి నుంచి నీళ్లపై తేలియాడుతున్న సామాన్లతోపాటు నేను భద్రపరచుకున్న తన కార్యక్రమాల చరిత్ర నోటు పుస్తకం, పేపర్ క్లిప్పింగ్‌లు వరదపాలయ్యాయని పిచ్చయ్య ఆవేదనతో వివరించారు. సీపీఐ, ప్రజాసంఘాలు తనకిచ్చిన అవకాశానికి సంబంధించిన ఆదరణ... ఆ చరిత్ర అంతా పోవడం ఇప్పటికీ మరచిపోలేని మనోవేదనను మిగిల్చిందని పిచ్చయ్య తెలిపారు. తన నోటు పుస్తకం పోయిన బాధ నుంచి బయటపడటం సాధ్యం కాలేదని, ఒక్కో నోటు పుస్తకంలో 300 పైబడి పేజీలు ఉంటాయని, క్లిప్పింగ్‌లూ దాదాపు అంతేనని అన్నారు. అందులో ఉన్న విలువైన సమాచారం సేకరించడం అసాధ్యంగా మారిందని, అదంతా సీపీఐ, ప్రజాసంఘాల్లో ఉన్న పెద్దలు, పూర్వీకులు అందరికీ తెలుసని పిచ్చయ్య తెలిపారు. సాహిత్య ప్రియులకు పిచ్చయ్య సూచిస్తున్నదేమిటంటే... చరిత్రను భద్రపరచుకోవడంలో అలసత్వం ఉండకూడదన్నారు. ఏదైనా మంచి సాహిత్యం భావితరాలకు, కుటుంబ సభ్యులకు అందించాలన్నా... భద్రపరచుకోవాల్సిన ఆవశ్యకత తన సంఘటనతో గుర్తెరగాల్సిన అవసరముందని విజ్ఞప్తి చేశారు.

మహిళా భద్రతపై ప్రజాచైతన్యం: రాష్ట్రపతి

న్యూదిల్లీ: సమాజంలో మహిళల భద్రత, గౌరవంపై అవగాహన పెంచాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఏ మహిళ ఎక్కడైనా... ఎప్పుడైనా అభద్రతకు లోనుకాని పరిస్థితి నెలకొల్పాల్సి ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఏదైనా దేశ బలం మహిళల సాధికారతపైనే ఆధారపడి ఉంటుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. సీఎన్ఎన్-న్యూస్18 షీశక్తి 2024 కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. 'మన మహిళలు ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎప్పుడూ ధైర్యం, శక్తి ప్రదర్శిస్తూ ముందడుగు వేస్తున్నారు. మన దేశంలో ఆడవారి భద్రతకు కఠినచట్టాలు చేశారు. కానీ, దురదృష్టవశాత్తు అభద్రతా భావం ఇంకా కొనసాగుతోంది. సంప్రదాయ వాదం, సామాజిక సంకుచిత భావంతో మహిళలు పోరాడుతున్నారు. చాలా మార్పులు జరిగినా... ఏళ్ల తరబడి నాటుకు పోయిన సామాజిక భావనలు మహిళా సమానతకు అడ్డంకిగా మారుతున్నాయి. సమాజంగా మనమంతా ఆత్మపరిశీలన చేసుకొని ... పరిస్థితి మెరుగుపడటానికి ఏంచేయాలని ప్రశ్నించుకోవాల్సిన అవసరముంది. మహిళలకు భద్రత, గౌరవం అనేది దేశ ప్రగతికి చాలా కీలకం. మహిళలకు రక్షణ, వారి మర్యాదను కాపాడుతామని మనందరం కలిసి బలమైన నిర్ణయం తీసుకొని ముందుకు సాగాలి. కొన్ని వందల సంవత్సరాల క్రితమే మన దేశానికి మాతృ హోదా ఇచ్చాం. మనం పుట్టిన ప్రదేశాన్ని తల్లిగా భావిస్తాం. మహిళలకు అత్యుత్తమ గౌరవం ఇచ్చే సంప్రదాయం ఇక్కడ ఉంది. మహిళలను దేవతలుగా పూజిస్తాం. ఒక వైపు దుష్ట సంహారం చేసే కాళీ, దుర్గగా... మరోవైపు ఆశీర్వదించే లక్ష్మీ, సరస్వతిగా కొలుస్తాము. మహిళలు నిజమైన శక్తికి ప్రతిరూపాలు' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ సారి షీశక్తి కార్యక్రమం 'బ్రేకింగ్ బ్యారియర్స్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన మహిళలు దీనిలో తమ అనుభవాలను పంచుకోనున్నారు.

వరదలతో యూపీ అతలాకుతలం

14 మంది మృతి

లక్నో: భారీ వర్షాలు, వరదలకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అతలాకుతలమవుతోంది. గత శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గంగా, శారదా, ఘఘ్రా సహా తదితర నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి దీంతో నదీ పరివాహ ప్రాంతాల్లోకి వరద పోటెత్తుతోంది. ఈ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో ఇప్పటి వరకూ 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తాజాగా తెలిపారు. మీరట్‌లోని జాకీర్ కాలనీలో భవనం కూలిన ఘటనలో 10 మంది వరకూ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక గోండాలో ఆదివారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఓ మహిళ సహా ఇద్దరు వ్యక్తులు నీటిలో మునిగి చనిపోయారు. షాజహాన్‌పూర్‌లోని నది నుండి మేకను రక్షించే ప్రయత్నంలో ఇద్దరు పిల్లలు మునిగిపోయారు. మరో నలుగురు పిల్లల్ని కాపాడినట్లు షాజహాన్‌పూర్ ఎస్పీ తెలిపారు. మరోవైపు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది.

కెనడాలో తెలంగాణ యువకుడి మృతి

ఒట్టావా: సోదరుడి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలనుకున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన కెనడాలో జరిగింది. కెనడా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ మీర్‌పేట్‌కు చెందిన ప్రణీత్ కెనడాలో ఎంఎస్ చదువుతున్నాడు. తన సోదరుడి పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులతో కలిసి టొరంటోలోని లేక్ క్లియర్‌లో ఈత కొట్టడానికి వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు అధికారులకు సమాచారం అందించగా... వారు మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే అతను చనిపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది. ప్రణీత్ మరణవార్తను మీర్‌పేటలో నివసిస్తున్న అతని తల్లిదండ్రులకు చేరవేశారు. విషయం తెలుసుకుని మృతుడి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతదేహాన్ని వీలైనంత త్వరగా హైదరాబాద్‌కు తెప్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. ప్రణీత్ మృతితో మీర్‌పేటలో విషాదఛాయలు అలముకున్నాయి.

రైతులు, యువత లక్ష్యంగా కాంగ్రెస్ హామీలు

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రమిస్తోంది. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో కలిసి ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్... ఓటర్లను ఆకట్టుకొనేందుకు అనేక హామీలతో మ్యానిఫెస్టో విడుదల చేసింది. శ్రీనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేడా, పీసీసీ అధ్యక్షుడు తారిక్ హమీద్ కర్రా మేనిఫెస్టో విడుదల చేశారు. రైతులు, యువత సంక్షేమమే లక్ష్యంగా హామీలు గుప్పించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే... అన్ని పంటలకు బీమా కల్పించడంతో పాటు కిలో యాపిల్‌కు కనీస మద్దతు ధర రూ.72 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. 'భూమిలేని, కౌలుదారులకు ఏడాదికి అదనంగా రూ.4 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి సాగుచేసుకుంటున్న భూమిలేని రైతులకు 99 ఏళ్ల లీజును కూడా ఏర్పాటు చేస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో లక్ష ప్రభుత్వ ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం. అర్హులైనవారికి నెలకు రూ.3500 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం. రైతులకు 100 శాతం సాగునీరందేలా అన్ని జిల్లా స్థాయి నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.2,500 కోట్ల నిధిని ఏర్పాటు చేస్తాం' అని హామీ ఇచ్చారు.

ముగిసిన తొలి విడత ప్రచారం

మరోవైపు, సెప్టెంబర్ 18న తొలి విడత పోలింగ్ జరగనుండటంతో ఆ నియోజకవర్గాల్లో ప్రచారం నేటితో ముగిసింది. మొత్తం 90 స్థానాలకుగాను దక్షిణ కశ్మీర్ అనంత్‌నాగ్, పుల్వామా, షోపియాన్, కుల్గాం జిల్లాల్లోని 24 అసెంబ్లీ స్థానాలకు మొదటి దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. రెండో దశలో 26 స్థానాలకు, మూడో దశలో మిగిలిన 40 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.